మనం

/manamnews
www.manamnews.com

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్
గురువారం
30-11-2023
వెల. రూ.5
• సంపుటి : 7 • సంచిక : 302
పేజీలు : 8

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

కార్తీక మాసం, గురువారం, తిథి. తదియ మ.03.25 వరకు, నక్షత్రం: ఆరుద్ర, మ:03.01 వరకు, వర్జ్యం: సా.03.51-05.33 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.14-10.58 వరకు, రాహుకాలం: మ.01.27-02.50 వరకు

కేంద్రంతో మణిపూర్ తిరుగుబాటు సంస్థ శాంతి ఒప్పందం..

అమిత్ షా కీలక ప్రకటన

ఇంఫాల్, నవంబర్ 29 : మణిపూర్ శాంతి ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. మణిపూర్‌లో తిరుగుబాటు గ్రూపు యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (యుఎన్ఎల్ఎఫ్) కేంద్ర ప్రభుత్వంతో శాంతి ఒప్పందం కుదుర్చుకున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ ఒప్పందంతో ఈశాన్య భారతంలో శాంతి నెలకొల్పే ప్రయత్నంలో కీలక పురోగతి జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. మే3న మణిపూర్లో హింసాత్మక ఘటనలు జరిగిన తర్వాత ఓ నిషేధిత సంస్థ ప్రభుత్వంతో శాంతి చర్చలు జరపడం ఇదే తొలిసారి. శాంతి ఒప్పందాన్ని ప్రకటించిన అమిత్ షా.. 'మణిపూర్‌లోని పురాతన సాయుధ సంస్థ యూఎన్ఎల్ఎఫ్ హింసను త్యజించి జన స్రవంతిలో చేరడానికి అంగీకరించింది. వారిని ప్రజాస్వామ్యంలోకి స్వాగతిస్తున్నాం. శాంతి, అభివృద్ధి ప్రయాణంలో వారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను' అని ట్విట్టర్ వేదికగా తెలిపారు. కాల్పుల ఒప్పందంలో భాగంగా సాయుధులు ఆయుధాలను అప్పగిస్తున్న వీడియోను షేర్ చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఎనిమిది మైతీ తీవ్రవాద సంస్థలపై ఉన్న నిషేధాన్ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నవంబర్ 13న పొడిగించింది. వాటిని చట్టవిరుద్ధమైన సంఘాలుగా ప్రకటించింది. ఈ నిషేధిత సంస్థల్లో యూఎన్ఎల్ఎఫ్ కూడా ఉంది. యూఎన్ఎల్ఎఫ్ సంస్థ శాంతి ఒప్పందం గురించి సీఎం బీరేన్ సింగ్ నవంబర్ 26నే ప్రకటించారు.

సీఏఏ అమలును ఎవరూ ఆపలేరు..

బెంగాల్‌లో తదుపరి ప్రభుత్వం బిజెపిదే.. కోల్‌కతా సభలో కేంద్రమంత్రి అమిత్ షా

కోల్‌కతా, నవంబర్ 29 : పౌరసత్వ సవరణ చట్టం అమలు కాకుండా ఏ శక్తీ ఆపలేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. సీఏఏ ఈ దేశ చట్టమని స్పష్టం చేశారు. కోల్‌కతాలో బుధవారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. మమతా బెనర్జీ ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతోందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ఓటు వేసి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. సీఏఏ ఈ దేశ చట్టం. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ దీనిని అమలుచేస్తుంది. ఎవరూ దీన్ని ఆపలేరు' అని పరోక్షంగా మమతా బెనర్జీ వ్యతిరేకతను ప్రస్తావిస్తూ అమిత్‌షా అన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి 2014 డిసెంబర్ 31, అంతకంటే ముందు వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రిస్టియన్ మైగ్రెంట్లకు పౌరసత్వం కల్పించేందుకు ..మిగతా 2లో

నోడల్ అధికారులను నియమించారా..?

నాలుగు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసు

న్యూఢిల్లీ, నవంబర్ 29 : దేశవ్యాప్తంగా పెరుగుతున్న ద్వేషపూరిత ప్రసంగాల కేసులపై సుప్రీంకోర్టు బుధవారం నాలుగు రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. నోడల్ అధికారులను నియమించారా లేదా అని చెప్పాలని రాష్ట్రాలను సుప్రీంకోర్టు కోరింది. నోటీసులు జారీ చేసిన రాష్ట్రాలలో గుజరాత్, కేరళ, నాగాలాండ్, తమిళనాడు ఉన్నాయి. సుప్రీంకోర్టులో ఈ కేసు తదుపరి విచారణ 5 ఫిబ్రవరి 2024న జరగనుంది. కేంద్ర ప్రభుత్వం స్టేటస్ రిపోర్టు దాఖలు చేసి 28 రాష్ట్రాలు నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపింది. గుజరాత్, కేరళ, నాగాలాండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఇంకా తమ సమాధానాన్ని దాఖలు చేయలేదని ఏఎస్జీ కేఎం నటరాజన్ కోర్టుకు తెలిపారు. నోడల్ అధికారుల ..మిగతా 2లో

ఆలయాల్లో నేతల ప్రత్యేక పూజలు

భాగ్యలక్ష్మి ఆలయంలో కిషన్ రెడ్డి పూజలు

బిర్లా టెంపుల్ సందర్శించిన కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్, నవంబర్ 29 (మనం న్యూస్): గురువారం ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ నేతలు ఆలయాల బాట పట్టారు. కాంగ్రెస్, బిజెపి నేతలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించు కోవాలని కేంద్ర మంత్రి, బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన హైదరాబాద్ భాగ్యలక్ష్మి అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఇప్పటికే నాలుగు రాష్ట్రాల ఎన్నికలు అయిపోయాయని, తెలంగాణలో గురువారం ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని, ప్రజలెవరూ డబ్బులు సహా ఇతర ప్రలోభాలకు లొంగకుండా.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రజలు, దేశ ప్రజల మీద భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రజలపై భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అవినీతి రహిత, ప్రజాస్వామ్యయుత రాష్ట్రంగా వెల్లివిరి యాలని అమ్మవారిని కోరుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు బిర్లా టెంపుల్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ..మిగతా 2లో

భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

పోలింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రత

డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ సామాగ్రి అందచేత

పోలింగ్ సామాన్లతో కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

ఉదయం మాక్ పోలింగ్.. తరువాత పోలింగ్‌కు అనుమతి

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పోలింగ్‌కు సర్వం సిద్ధం

ప్రతి ఒక్కరు ఓటు వేయండి

పలు కేంద్రాలను సందర్శించిన వికాస్ రాజ్

ఓటు వేసే ప్రతి పోలింగ్ కేంద్రం పండగ వాతావరణంలా ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి సమస్య రాకుండా ఉండేలా అధికారులకు శిక్షణ ఇచ్చామని స్పష్టం చేశారు. గతం కంటే మెరుగైన ఓటింగ్ శాతం నమోదవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు తమ అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలి. ఇదే చివరి రోజు.. ఓటర్లు అందరూ ఆలోచించి ఓటు వేయాలి. ఎలాంటి ప్రలోభాలకు లొంగకూడదు. మీ కుటుంబసభ్యులు, చుట్టుపక్కల కుటుంబసభ్యులతో వచ్చి సంతోషంగా ఓటు వేయాలని కోరుతున్నాను. - వికాస్ రాజ్

మరిన్ని.. 2లో

తెలంగాణ గతిని మలుపు తిప్పిన ఘట్టం

తెలంగాణ అజరామర చరిత్రకు వీరోచిత సంతకం దీక్షా దివస్ 2

ఉద్యమ చైతన్యాన్ని మరోసారి గుర్తుకు తెచ్చుకుందామన్న కేటీఆర్

కిక్కిరిసిన ఎంజీబీఎస్, జేబీఎస్

సొంతూళ్లకు హైదరాబాద్ వాసులు..

ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్టాండ్లు

హైదరాబాద్, నవంబర్ 29 (మనం న్యూస్): హైదరాబాద్ నగర వాసులు సొంతూళ్లకు పయనం అయ్యారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఎన్నికల్లో ఓటు వేసేందుకు గ్రామాలకు వెళ్తున్నారు. ఉపాధి, విద్య నిమిత్తం ..మిగతా 2లో

కేటీఆర్‌పై చర్యలు తీసుకోండి

సీఈసీ వికాస్ రాజ్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు

హైదరాబాద్, నవంబర్ 29 (మనం న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర ఎన్నికల అధికారికి కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘించినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్‌కు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్ నేత టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ జి.నిరంజన్ ఈ మేరకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ నేత నిరంజన్ తన ఫిర్యాదులో ఓటర్లను ప్రభావితం చేసేలా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రవర్తించారని, కచ్చితంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం ముగిసి, సైలెంట్ పీరియడ్ కొనసాగుతున్న తరుణంలో ఎటువంటి పార్టీ కార్యకలాపాలు నిర్వహించకూడదని ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉన్నప్పటికీ, కేటీఆర్ ఆ నిబంధనలను తుంగలో తొక్కి తెలంగాణ భవన్‌లో దీక్ష దివస్‌ను నిర్వహించారన్నారు. కేటీఆర్ రక్తదానం కార్యక్రమాన్ని చేశారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఎంతో చేశారని, ఆ రోజులను మళ్లీ గుర్తు చేసుకోవాలని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఓటర్లను ప్రభావితం చేసేలా ఉన్నాయని ఆయన ..మిగతా 2లో

నేటి ఎన్నికలపై సర్వత్రా ఉత్కంఠ

బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల గెలుపులపై బెట్టింగ్‌లు

రంగంలోకి బుకీలు దిగినట్లు వార్తలు

హైదరాబాద్, నవంబర్ 29 (మనం న్యూస్): తెలంగాణ ఎన్నికలపై బెట్టింగ్ గతంలో ఎప్పుడూ లేనంతగా ఆసక్తి నెలకొంది. ఈసారి బిఆర్ఎస్ గెలుస్తుందా లేక.. కాంగ్రెస్ గెలుస్తుందా అన్న ఉత్కంఠ నెలకొంది. ప్రజలు ఎవరికి ఓటేస్తారన్న ఆసక్తి కూడా నెలకొందది ఈ క్రమంలో పందాలరాయుళ్ళు రంగంలోకి దిగారు. ఈ మేరకు బెట్టింగ్ దందా జోరుగా సాగుతోంది. ఇప్పటికే కోట్లల్లో దాందా సాగినట్లు సమాచారం. గురువారం సాయంత్రం విడుదలయ్యే ఎగ్జిట్ పోల్స్ ..మిగతా 2లో



రేషన్ కార్డు ఉన్నవారికి కేంద్రం శుభవార్త..

ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం

మరో ఐదేళ్లు పొడిగించిన కేంద్రప్రభుత్వం 2

ఇసి ఆదేశాలు బేఖాతర్

సెలవులు ఇవ్వని సంస్థలపై ఫిర్యాదులు

హైదరాబాద్, నవంబర్ 29 (మనం న్యూస్): తెలంగాణ వ్యాప్తంగా నవంబర్ 30న గురువారం ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో విద్యాసంస్థలకు, ప్రైవేటు సంస్థలకు ఇప్పటికే సెలవులు ప్రకటించిన విషయం తెలిసింది. అయితే ఈసీ సెలవు ప్రకటించినప్పటికీ పలు సంస్థలు, కళాశాలలు పట్టించుకోని పరిస్థితి. ఈ క్రమంలో రేపు సెలవు ఇవ్వడం లేదని ఎలక్షన్ కమిషన్‌కు అనేక ఫిర్యాదులు వచ్చి చేరాయి. దాదాపు 1950కు పైగా పలు ప్రైవేట్ సంస్థలు, కళాశాలల నుంచి వరుస ఫిర్యాదులు వచ్చాయి. స్థానిక అధికారులకు చెప్పినా ఫలితం లేకపోవడంతో స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ప్రభుత్వ, ప్రైవేట్ సెలవు ఇవ్వాలని ఎలక్షన్ కమిషన్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీంతో తమ ఆదేశాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఈసీ హెచ్చరికలు జారీ చేసింది.

నోడల్ అధికారులను నియమించారా..?

(మొదటిపేజీ తరువాయి)

నియామకానికి సంబంధించి కూడా ఎలాంటి సమాచారం లేదు. ఎన్ని రాష్ట్రాలు తమ సమాధానాలను దాఖలు చేశాయని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

నోడల్ అధికారులను నియమించారా లేదా?

నోడల్ అధికారిని నియమించినట్లు బెంగాల్ ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. అక్టోబర్ 11న హోంశాఖ కార్యదర్శి అన్ని రాష్ట్రాల సమావేశాన్ని పిలిచి తీసుకోవాల్సిన చర్యలు, సమ్మతి నివేదికలు సమర్పించాల్సిన ఆవశ్యకత గురించి తెలియజేసినట్లు ఏఎస్జీ తెలిపారు. రాష్ట్రాలకు నోటీసులు జారీ చేస్తామని జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. నోడల్ అధికారిని నియమించారా లేదా అని రాష్ట్రం తెలియజేయాలి?

వ్యక్తిగత విషయాలతో వ్యవహరించలేను - జస్టిస్ ఖన్నా

పిటిషనర్ తరపు న్యాయవాది నిజాం పాషా మాట్లాడుతూ.. ఎవరైనా విద్వేషపూరిత ప్రసంగం చేస్తే మళ్లీ సమావేశాల్లో ప్రసంగించేందుకు అనుమతిస్తామని తెలిపారు. వ్యక్తిగత కేసులను మేము పరిష్కరించలేమని, మీరు సంబంధిత హైకోర్టును ఆశ్రయించవచ్చని జస్టిస్ ఖన్నా అన్నారు. జూలై 7, 2018న, ద్వేషపూరిత ప్రసంగాలను నిషేధించాలని కోర్టు మార్గదర్శకాలను జారీ చేసింది.

ద్వేషపూరిత ప్రసంగం తీవ్రమైన నేరం - సుప్రీంకోర్టు

ద్వేషపూరిత ప్రసంగాన్ని తీవ్రమైన నేరంగా సుప్రీంకోర్టు పేర్కొన్న సంగతి తెలిసిందే. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ద్వేషపూరిత ప్రసంగాలకు సంబంధించి సుప్రీంకోర్టు ఒక ప్రకటనలో రాజకీయాలు, మతాలు విడిపోయే రోజు ద్వేషపూరిత ప్రసంగాలు నిలిచిపోతాయని పేర్కొంది.

రేషన్ కార్డు ఉన్నవారికి కేంద్రం శుభవార్త..

న్యూఢిల్లీ, నవంబర్ 29 : రేషన్ కార్డు ఉన్న వారికి కేంద్రం శుభవార్త అందించింది. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పొడిగిస్తూ కేంద్రం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ బుధవారం ప్రకటించారు. కరోనా సమయంలో పేద ప్రజలకు ఉచిత రేషన్ అందించేందుకు కేంద్రం ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ఈ పథకాన్ని తీసుకువచ్చింది. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 81 కోట్ల మంది పేద ప్రజలు లబ్ధి పొందుతన్నారు. అయితే ఇప్పుడు ఈ పథకాన్ని మరో ఐదేళ్లు పొడిగిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో సమావేశమైన కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ నవంబర్ 29న వెల్లడించారు. ఈ పొడగింపు జనవరి 1, 2024 నుంచి డిసెంబర్, 2028 వరకు వర్తిస్తుందని, దీని ద్వారా పేద ప్రజలకు కేంద్ర సర్కార్ ఉచితంగా బియ్యం పంపిణీ చేయనుందని చెప్పారు. ఈ నిర్ణయంతో కేంద్రంపై అదనంగా మరో రూ.11.8 లక్షల కోట్ల భారం పడుతుందని ఆయన తెలిపారు. కాగా ఈ పథకాన్ని ఏప్రిల్ 2020లో కరోనా లాక్ డౌన్ విధించిన క్రమంలో కేంద్రం పీఎంజీకేఏవై పేరుతో ప్రకటించింది. దీనికి ద్వారా రేషన్ కార్డు ఉన్నవారు నెలల రూ.5 కిలోల ఉచిత రేషన్ అందించింది. అయితే మొదట మూడు నెలలకు మాత్రమే ఉచితంగా రేషన్ ఇచ్చేందుకు ఈ స్కీమ్ తెచ్చారు. ఆ తర్వాత పలు మార్లు ఈ స్కీమ్ పొడిగించింది కేంద్రం. ఇప్పుడు మరో 5 ఏళ్లు పొడగించి ఉచితంగ రేషన్ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఈ పథకం డిసెంబర్ 2023లో అంటే వచ్చే నెలలో గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర కెబినెట ఈ పథకాన్ని పొడగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పొడగింపుతో లబ్ధిదారులు 2028 వరకు ఉచిత రేషన్ పొందవచ్చు.

సీఏఏ అమలును ఎవరూ ఆపలేరు..

(మొదటిపేజీ తరువాయి)

సీఏఏ 2019 ఉద్దేశించింది. డిసెంబర్ 12న ఈ చట్టాన్ని నోట్లి చేయగా, 2020 జనవరి 10 నుంచి అమల్లోకి వచ్చింది. పశ్చిమబెంగాల్ భవిష్యత్తుపై బీజేపీకి స్పష్టమైన విజన్ ఉందని కోల్‌కతా ర్యాలీలో అమిత్‌షా తెలిపారు. పశ్చిమబెంగాల్ ప్రజలు 18 లోక్‌సభ స్థానాలు, 77 స్థానాలు బీజేపికి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ అసెంబ్లీ నుంచి బీజేపీ నేత సువేందు అధికారిని సస్పెండ్ చేసి ఉండవచ్చని, కానీ ప్రజల వాణిని అణగదొక్కలేరని అన్నారు. బెంగాల్ ప్రభుత్వాన్ని సాగనంపుతామని ప్రజలంతా చెబుతున్నారని తెలిపారు. రాష్ట్ర సంక్షేమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పంపుతున్న నిధులు అధికార టీఎంసీ జోక్యం వల్లే ప్రజలకు చేరడం లేదని ఆరోపించారు. బీజేపీ 2026 అసెంబ్లీ ఎన్నికల్లో మూడింట రెండు వంతుల మెజారిటీతో పశ్చిమబెంగాల్‌లో అధికారంలోకి వస్తుందని అమిత్‌షా ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇవ్వాలని, తద్వారా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయానికి బాసటగా నిలబడాలని కోరారు. పశ్చిమబెంగాల్‌లో 212 మంది బీజేపీ కార్యకర్తలను హత్య చేశారని, 2026 ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయడం ద్వారా ఇందుకు ప్రతీకారం తీర్చుకోవాలని అన్నారు.

నల్లనేలపై ఎన్నికల కోలాహలం

జోరుగా చీరలు, మద్యం, డబ్బుల పంపిణీ

నస్పూర్, నవంబర్ 29 (మనం న్యూస్): శాసనసభ ఎన్నికలు ఒక్కరోజులో జరుగనున్న నేపథ్యంలో వివిధ పార్టీ నాయకుల హడావుడి మొదలైంది, ఎలాగైన తమ పార్టీ అభ్యర్థిని గెలుపించుకోవడం కోసం ఓటర్లను మభ్యపెట్టడానికి అనేక రకాలుగా ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. రాత్రి ఎటువంటి ఇబ్బందులు ఉండవని అన్ని పార్టీల నాయకులు పంపిణీ కార్యక్రమంలో ముందున్నారు. బుధవారం మున్సిపాలిటి పరిధిలోని కటిక దుకాణాల వద్ద 110 చీరలను ప్లెయింగ్ బృందం స్వాధీనం చేసుకుంది. ఈ చీరలను టిఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ గుంట జగ్గయ్య మా ఇంట్లో ఉంచాడని ఇంటి యాజమాని తెలిపారు. అలగే సీసీసీ కార్నర్ వద్ద రెండు బైకులపై తీసుకేళ్తున్న 197 చీరలను కూడా స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండ మద్యం బాటిల్లను కూడా స్వాదీనం చేసుకున్నారని తెలిసింది. బుధవారం రాత్రి ఇంకా జోరుగా సాగుతుందని చర్చ సాగుతుంది.

అసలు ఆట మొదలు

హైదరాబాద్, నవంబర్ 29 (మనం న్యూస్): ప్రత్యేక తెలంగాణలో మూడోసారి ఎన్నికలు జరుగబోతున్నాయి. గురువారం జరిగే అసెంబ్లీ ఎన్నికలు ఒకేదఫాలో జరుగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు పోలింగ్ జరుగనుంది. మొత్తం 119 అసెంబ్లీ స్థానాలో పోలింగ్ జరుగునుండా... అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల్లో రాష్ట్ర పోలీసులు లక్షమంది సిబ్బందితోపాటు కేంద్ర బలగాలను కూడా రంగంలోకి దించారు. సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అదనపు బలగాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ ఎన్నికల విధుల్లో 375 కంపెనీల కేంద్ర బలగాలు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,655 ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4,400 సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి అదనంగా సిబ్బందిని నియమించారు. అస్సాం రైఫిల్స్, బోర్డర్స్ సెక్యూరిటీ ఫోర్స్,సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ ఎన్నికల విధుల్లో ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను బద్రతా సిబ్బంది తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. ఇక్కడ విధులు నిర్వహించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి హోంగార్డు సిబ్బంది వచ్చారు. కాగా ఇప్పటికే ఎన్నికలు బహిష్కరణకు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. దీంతో ఏజన్సీ ప్రాంతాల్లో భద్రత మరింత కట్టుదిట్టం చేశారు. కేంద్ర బాలగాలు ఏజెన్సీ ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ విధించారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. మద్యం, డబ్బులు పంపిణిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే సిసిటీవీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. తెలంగాణలో పోలింగ్‌కు సర్వం సన్నద్ధం కాగా పోలింగ్ సామాగ్రిని తీసుకుని అధికారులు తమకు కేటాయించిన కేంద్రాలకు ప్రత్యే వాహనాల్లో వెళ్లారు. దీని కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అక్కడికే సిబ్బంది చేరుకొని తమకు కేటాయించిన సామగ్రిని కలెక్ట్ చేసుకుని బయలుదేరారు.ఎన్నికల విధులకు హాజరయ్యే ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును ఫెసిలిటీ సెంటర్‌లో కూడా వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. అక్కడే ఎన్నికల సామగ్రి కలెక్ట్ చేసుకొని అక్కడి నుంచి ఏర్పాటు చేసిన వెహికల్స్‌లో పోలింగ్ కేంద్రాలకు చేరుకోనున్నారు. ఎన్నికల సామగ్రి, సిబ్బందిని చేరవేసేందుకు ఉంచిన వాహనాలకు ముందే రూట్ మ్యాప్ ఇచ్చారు. ఆ ప్రకారమే వెహికల్స్ మూమెంట్ ఉంటుంది. వేరే దారిలో వెళ్లే పరిస్థితి ఉండకూడు. మార్గ మధ్యలో ఆప కూడదని కూడా ఆదేశాలు ఉన్నాయి. వాటికి జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందని ఏ జరుగుతుందో స్పష్టంగా తెలిసిపోతుందని ఏదైనా సమస్య ఉంటే వెంటనే అధికారులు అక్కడకు చేరుకుంటారని పేర్కొన్నారు. గురువారం ఉదయం ఐదున్నరకే మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఆటైంకు అభ్యర్థుల ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలో ఉండాలని అధికారులు ఆదేశించారు. పోలింగ్ ఏజెంట్లు ఈవీఎంలను టచ్ చేయడానికి వీల్లేదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అందరి సమక్షంలో మాక్ పోలింగ్ జరిగిన తర్వాత ఉదయం ఏడు గంటలకు సాధారణ పోలింగ్ పక్రియ మొదలు కానుంది. గురువారం ఉదయం 7 నుంచి సాయంత్రం ఐదు వరకు పోలింగ్ జరగనుంది. నక్సల్స్ ప్రభావిత 13 నియోజకవర్గాల్లో మాత్రం సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిస్తారు మిగతా ప్రాంతాల్లో ఐదు గంటల వరకు పోలింగ్ పక్రియ కొనసాగనుంది. ఐదు గంటల వరకు క్యూలైన్‌లో ఉన్న వారికి ఓటు వేసుకునే హక్కు ఉంటుంది. పోలింగ్ కోసం ఎన్నికల సంఘం ఈసారి విస్తృత ఏర్పాట్లు చేసింది. తెలంగాణ వ్యాప్తంగా 35,655 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అక్కడ దివ్యాంగుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంది. వారు ఓటు వేసి వెళ్లేందుకు వీలుగా 21,686 వీల్‌ఛైర్లు ఏర్పాటు చేసింది. 80 ఏళ్లుపైబడిన వారికి ఉచిత రవాణా సదుపాయం కూడా కల్పిస్తోంది. ఓటరు స్లిప్పులు, నమూనా బ్యాలెట్లు పంపిణీ చేసింది. దివ్యాంగుల కోసం బ్రెయిలీ లిపి ఉన్న ఓటరు స్లిప్‌లను పంపిణీ చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 644 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో 120పైగా కేంద్రాలను దివ్యాంగులే నిర్వహించనున్నారు. మరో ఆరువందల కేంద్రాలను మహిళలు నిర్వహించనున్నారు. ఎన్నికల కోసం 375 కంపెనీల సాయుధ బలగాలు, 50వేల మంది స్థానిక పోలీసులను ఎన్నికల సంఘ వినియోగిస్తోంది. ఓటరు స్లిప్‌లను మాత్రం గుర్తింపు కార్డుగా పరిగణలోకి తీసుకోమని... ఓటరు ఐడీ కానీ వేరే ఇతర 12 రకాల ఐడీలు కానీ ఉండాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఓటరు స్లిప్పులపై ఎలాంటి గుర్తులు ఉండటానికి వీల్లేదని చెప్పింది. అలాంటి వాటిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతి ఇస్తామని లేకుంటే తిరస్కరిస్తామని పేర్కొంది. ఓటు వేసేందుకు వచ్చిన వాళ్లు ఎవరూ ఫోన్లు తీసుకురావద్దని అధికారులు సూచిస్తున్నారు. ఓట్లు వేసినప్పుడు సెల్ఫీలు, ఇతర ఫొటోలు తీయడానికి కూడా వీల్లేదని చెబుతున్నారు. అలాంటి ప్రయత్నాలు చేసిన వాళ్లు కచ్చితంగా శిక్షార్హులు అవుతారని హెచ్చరిస్తున్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

హైదరాబాద్, నవంబర్ 29 (మనం న్యూస్): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు దాదాపుగా పూర్తి కావచ్చాయి. గురువారం పోలింగ్ జరుగనుండటంతో అధికారులు ఏర్పాట్లలో బిజీబిజీగా ఉన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ పక్రియను ఉదయం నుంచే ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా సిబ్బంది ఇప్పటికే డీఆర్సీ కేంద్రాలకు చేరుకోగా వారికి అధికారులు ఈవీఎంలు, ఇతర సామాగ్రిని అందజేసారు. సామాగ్రిని తీసుకుని సాయంత్రంలోగా సిబ్బంది తమతమ పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. దాదాపు 1.85 లక్షల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. కాగా, పోలింగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 19,375 ప్రాంతాల్లో మొత్తం 35,356 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశారు. అందులో 27,094 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన కోసం 22 వేల మంది మైక్రో అబ్జర్వర్‌లను, స్క్వాడ్‌లను నియమించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ రాష్ట్రంలోని అన్ని డీఆర్సీ కేంద్రాలను సందర్శించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీని పరిశీలించారు. మరోవైపు కలెక్టర్ అనుదీప్ హైదరాబాద్ పరిధిలోని డీఆర్సీ కేంద్రాలను సందర్శించారు. కాగా, రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహిస్తున్నారు. మొత్తం 2,290 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. కాగా, ఎన్నికల భద్రతా విధుల కోసం రాష్ట్ర పోలీసులతోపాటు కేంద్ర బలగాలను కూడా అధికారులు రంగంలోకి దించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల దగ్గర భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పక్రియలో భాగంగా ఇప్పటికే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరంలలో పోలింగ్ పూర్తయ్యింది. గురువారంతో తెలంగాణలో కూడా పోలింగ్ ముగియనుంది. అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి డిసెంబర్ 3న ఓట్లను లెక్కించి ఫలితాలను వెలువరించనున్నారు.

తెలంగాణ గతిని మలుపు తిప్పిన ఘట్టం

హైదరాబాద్, నవంబర్ 29 (మనం న్యూస్): రాష్ట్రీయ రాజకీయ అస్తిత్వం కోసం.. దీక్షా దివస్ స్ఫూర్తిగా పునరంకితం అవ్వాలని మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ గతిని మలుపు తిప్పిన ఘట్టం దీక్షా దివస్ అని చెప్పారు. నాటి ఉద్యమ చైతన్యాన్ని మరోసారి గుర్తుకు తెచ్చుకుం దామని తెలిపారు. దేశాభివద్ధికి.. తెలంగాణను ఒక మోడల్‌గా నిలిపేందుకు ఆ రోజు బీజం పడిందన్నారు. నవంబరు 29న దీక్షా దివస్ సందర్భంగా ఆనాటి చరిత్రను గుర్తు చేస్తూ.. కేటీఆర్ ఓ ప్రకటనను విడుదల చేశారు. దిల్లీ పీఠం దిగి వచ్చేందుకు ఈ రోజే నాందీ వాచకం : తెలంగాణ అజరామర చరిత్రకు.. వీరోచిత సంతకం దీక్షా దివస్ అని కేటీఆర్ పేర్కొన్నారు. నవంబర్ 29, 2009 తన జీవితంలో మరచిపోలేనని చెప్పారు. దశాబ్దాలుగా దగాపడ్డ.. తెలంగాణ తల్లి దాస్య శంఖ లాలను తెంచేందుకు.. కేసీఆర్ నడుం బిగించిన రోజు ఇదని అన్నారు. రాష్ట్రం వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడోనని నినదిస్తూ.. ఆమరణ నిరాహార దీక్షకు దిగి.. దిల్లీ పీఠం దిగి వచ్చేందుకు ఈ రోజే నాందీ వాచకం పలికారని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ ఇస్తామని 2004లో బీఆర్ఎస్ (టీఆర్ఎస్)తో పొత్తుపెట్టుకొని.. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి దోఖా చేసేందుకు సిద్ధపడిందని కేటీఆర్ గుర్తు చేశారు. రాష్ట్రపతి ప్రసంగంలో, యూపీఏ కనీస ఉమ్మడి ప్రణాళికలో తెలంగాణ ఇస్తామని పార్లమెంట్ వేదికగా నమ్మబలికి తాత్సారం చేశారని ఆరోపించారు. అంతే కాకుండా.. సందర్భం వచ్చిన ప్రతిసారీ హస్తం పార్టీ తెలంగాణను అవమానాలు, అవహేళనలకు గురిచేస్తూనే వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. 'ఈ దశలో అక్టోబర్ 21, 2009న సిద్దిపేటలో జరిగిన ఉద్యోగ గర్జన సభలో.. కేసీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. రాష్ట్రం కోసం నేనే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతున్నా.. ఎట్ల తెలంగాణ రాదో చూస్తాను అని కేసీఆర్ ప్రకటించారు. తెలంగాణ సాధనే ధ్యేయంగా.. నవంబర్ 29న సిద్దిపేటలోని రంగధాంపల్లిలో ఆయన ఆమరణ నిరాహారదీక్షా వేదిక సిద్ధమైంది. హైదరాబాద్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి కేసీఆర్ పూలమాల వేసి, కరీంనగర్ తీగలగుట్టపల్లిలోని తెలంగాణ భవన్‌కు నవంబర్ 28న చేరుకున్నారు. నవంబర్ 29 తెల్లావారేసరికి ఆ ప్రాంతాన్ని పోలీసులు చుట్టుముట్టారు. మరోవైపు ఆయనకు.. ఉద్యమ శ్రేణులు రక్షణ కవచంగా నిలిచి పోలీసులను ప్రతిఘటించారు. దీంతో పోలీసులు తాత్కాలికంగా వెనక్కి తగ్గారు.'' అని కేటీఆర్ వెల్లడించారు. అక్కడినుంచి ఆమరణ దీక్ష చేసేందుకు.. కేసీఆర్ సిద్దిపేటకు బయలుదేరారని కేటీఆర్ పేర్కొన్నారు. పోలీసులు గందరగోళం సష్టించి ఆయనను అరెస్టు చేసి ఖమ్మంకు తరలించారని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆచార్య జయశంకర్.. కేటీఆర్, నేనూ .. మా ఇంటి నుంచే నిరసనకు దిగుతున్నామని ప్రకటించారని చెప్పారు. తదనంతర పరిణామాల్లో జయశంకర్‌ను ఖమ్మం తీసుకెళ్లారని వివరించారు. తనను మాత్రం అరెస్ట్ చేసి సెంట్రల్ జైలుకు తరలించారని పేర్కొన్నారు. కేసీఆర్ ఆమరణ దీక్షకు దిగిన ఈరోజు.. మలిదశ ఉద్యమంలో లక్ష్యం దిశగా అడుగులు వేసేందుకు మార్గదర్శకమైందని.. ఆ స్ఫూర్తిని కొనసాగిద్దామని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

ఓటు కోసం దారి పట్టిన పట్నం

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లో ఉంటున్న వారు తమ తమ సొంతూళ్లకు బయలు దేరారు. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్‌లో ప్రయాణికుల రద్దీ నెలకొంది. తెలంగాణలో గురువారం (నవంబర్ 30) అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. దీంతో ఓటు వేసేందుకు నగరంలో ఉంటున్న వారు సొంత ఊళ్లకు పయనం అయ్యారు. వేర్వేరు పనుల నిమిత్తం అనేక మంది హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. హైదరాబాద్‌లో ఉంటున్నా ఓటు హక్కు మాత్రం సొంత ఊరిలోనే ఉంది. దీంతో ఓటు హక్కును వినియోగించుకునేందుకు పల్లెబాట పట్టారు జనం. సహజంగా పండుగల సమయంలో మాత్రమే హైదరాబాద్‌లో ఉండే వారంతా సొంతూళ్లకు వెళ్తారు. పండుగల సమయంలో మాత్రమే రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లలో విపరీతమైన రద్దీ కనిపిస్తుంది. అయితే ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ వాసులు పల్లెబాట పడతారు. ఈసారి కూడా నగరంలో ఉంటున్న వారు తమ ఊళ్లకు పయనం అయ్యారు. సహజంగానే ఎన్నికల సమయంలో ఆర్టీసీ బస్సులకు సంబంధించి కొంత టైట్ సిచువేషన్ ఉంటుంది. ఒకవైపు ఎన్నికల నిర్వహణకు బస్సులను వినియోగిస్తూనే మరోవైపు ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా వారి గమ్య స్థానాలకు చేర్చేందుకు టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. ప్రయాణికుల సౌకర్యం కోసం సిటీలో తిరిగే బస్సులను కూడా జిల్లాలకు మళ్లిస్తున్నారు అధికారులు. ప్రతిరోజూ ఎంజీబీఎస్ నుంచి 3వేల 500 బస్సులు వెళ్తుంటాయి. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో అదనంగా వెయ్యి బస్సు సర్వీసులు ప్లాన్ చేశాము. సుమారు 4వేల 500 బస్సులు ప్లాన్ చేశాం. మహబూబ్ నగర్, ఖమ్మం సెక్టార్ కు వచ్చే సరికి హెవీ ట్రాఫిక్ ఉంది. దాని కోసం సిటీ నుంచి 62 బస్సులు అదనంగా పంపించాం. వీలైనంత తొందరగా బస్టాండ్‌ల నుంచి ప్రయాణికులను వారి వారి సొంతూళ్లకు పంపేందుకు మా ప్రయత్నం మేము చేస్తున్నాం. సిబ్బంది అంతా పని చేస్తున్నారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు చర్యలు చేపట్టారు. సుమారుగా 3లక్షల మంది ప్రయాణికులు ఎంజీబీఎస్ నుంచి ప్రయాణం చేస్తారని అంచనా వేశాము అని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఆలయాల్లో నేతల ప్రత్యేక పూజలు

(మొదటిపేజీ తరువాయి)

ఇంఛార్జి ఠాక్రే, అంజన్ కుమార్ యాదవ్, మల్లు రవితో పాటు పలువురు కీలక నేతలు ఈ పూజల్లో పాల్గొన్నారు. వేంకటేశ్వర స్వామి ముందు కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు పెట్టి పూజలు చేశారు. తర్వాత నాంపల్లి దర్గాలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రేవంత్ రెడ్డి ఎన్నికల్లో పోటీ చేస్తున్నప్పటికీ కొడంగల్, కామారెడ్డి నియోజకవర్గాల్లో ఆయన తరపున ఎన్నికల బాధ్యతలను ఆయన సోదరులు చూసుకుంటున్నారు. టీపీసీసీ చీఫ్‌గా ఆయన రాష్ట్రం మొత్తం విస్తృతంగా పర్యటించార. అభ్యర్థులకు వచ్చే సమస్యలు.. అధికార పార్టీ నుంచి వచ్చే ఇబ్బందులను అధిగమించేందుకు గాంధీభవన్‌లో ఓ ప్రత్యేక వార్ రూమ్ ను ఏర్పాటు చేశారు. రేవంత్ రెడ్డి కూడా అభ్యర్థులకు అందుబాటులో ఉంటున్నారు ఎలాంటి అవసరం వచ్చినా తక్షణం స్పందిస్తున్నారు. మరో వైపు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన ఆమరణదీక్ష ప్రారంభించిన తేదీ సందర్భంగా దీక్షా దివస్‌ను బీఆర్ఎస్ నేతలు నిర్వహించుకున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా బయట ఎక్కడా కార్యక్రమాలను నిర్వహించలేదు. పలు చోట్ల పార్టీ కార్యాలయాల్లోనే నిర్వహించారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ రక్తదానం చేశారు.

కేటీఆర్‌పై చర్యలు తీసుకోండి

(మొదటిపేజీ తరువాయి)

తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ 2009 నవంబర్ 29న ఆమరణ నిరాహార దీక్ష చేసిన రోజున దీక్ష దివస్‌గా బిఆర్ఎస్ పార్టీ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 144 సెక్షన్ అమలు అవుతున్న తరుణంలో ఓటర్లను ప్రభావితం చేసేలాగా కార్యకలాపాలు నిర్వహించారని, బిఆర్ఎస్ పార్టీ ఆఫీసులో కార్యక్రమాన్ని నిర్వహించి, రక్తదానం చేసి, కేటీఆర్ మాట్లాడారని కాంగ్రెస్ పార్టీ నేత నిరంజన్ ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల అధికారికి ఫ్యాక్స్ ద్వారా లేఖ పంపిన ఆయన వెంటనే కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెల్లవారితే ఎన్నికలు జరుగుతాయి అనగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ జి.నిరంజన్ ఫిర్యాదు చేయడం హాట్ టాపిక్‌గా మారింది.

కాయ్.. రాజా కాయ్

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత ఫలితాలు వెలువడే డిసెంబర్ 3వ తేదీ వరకు బెట్టింగ్ దందా కోట్లు దాటిటినా ఆశ్చర్యం లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. నెల క్రితమే ఏపీలోని పలు ప్రాంతాల్లో తెలంగాణ ఎన్నికలపై బెట్టింగులు సాగుతున్నాయని అప్పట్లో వార్తలు వినిపించాయి. హైదరాబాద్ లేదా తెలంగాణలో బెట్టింగ్ నిర్వహిస్తే పట్టుబడే అవకాశం ఉందని గుర్తించిన బుకీలు.. ఇతర ప్రాంతాల నుంచి దందా సాగిస్తున్నట్లు సమాచారం. ఏపీ, ముంబై, ఢిల్లీ, కోల్‌కతతోపాటు దేశంలోని పలు ఇతర నగరాల నుంచి ఇది జరుగుతున్నట్లు తెలుస్తోంది. కొందరు బుకీలు లండన్, అమెరికాల నుంచి యాప్‌ల ద్వారా బెట్టింగులు నిర్వహిస్తున్నట్లు తెలియవచ్చింది. ముఖ్యంగా ఒక పార్టీ గెలుపుపై రెట్టింపు పందేలు జరుగుతున్నాయి. అంటే ఆ పార్టీపై రూ. లక్ష కాస్తే.. అవతలవాళ్లు రూ. 2 లక్షలు ఇవ్వాలన్నమాట. డిసెంబర్ 3న కౌంటింగ్ జరిగింతవరకు బెట్టింగులు మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. కాగా తెలంగాణలో అసెంబ్లీ

పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

- శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి జిల్లాలో 3000 మంది జిల్లా, కేంద్ర పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు
- జిల్లాలో ఎన్నికల నియమావళి ఉల్లంఘన కు సంబంధించి 40 కేసులు నమోదు
- జిల్లా ఎస్పి సన్‌ప్రీత్ సింగ్ ఐపిఎస్

జగిత్యాల ప్రతినిధి,నవంబర్29(మనంన్యూస్): జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఇతర శాఖల సమన్వయంతో కలిసి పనిచేస్తున్నామని జిల్లా ఎస్పి తెలిపారు. తద్వారా జిల్లాలోని ప్రతి పౌరుడు స్వేచ్ఛగా తమ యొక్క ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పిస్తున్నాం అని, శాంతి యుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి జిల్లాలో సుమారు 3000 మంది జిల్లా, కేంద్ర పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి మండలానికి ఇన్స్పెక్టర్ స్థాయి అధికారితో ప్రత్యేక పెట్రోలింగ్ పార్టీలు, 94 రూట్ మోబైల్స్, 37 క్విక్ రియాక్షన్ టీమ్స్, స్టయికింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్, 10 బిఎస్ఎఫ్ కంపెనీల కేంద్రబలగాలు, మహారాష్ట్ర హోం గార్డ్స్ 800 మంది ఆర్టిసి, ఎపి పోలీస్ 160 మంది, సిఐడి 46 ను అంతేకాకుండా పోలింగ్ స్టేషన్లో 347 మంది ఎన్‌సిసి/ఎన్ఎస్ఎస్ వాలంటీర్ కూడా ఉపయోగిస్తామని అన్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వివరాలు...జిల్లాలో మొత్తం పోలింగ్ స్టేషన్‌లు 927, సాధారణ పోలింగ్ స్టేషన్లు 676, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 251

స్వాధిన పరుచుకున్న వివరాలు....

ఇప్పటివరకు స్వాధిన పరుచుకున్న నగదు 2,59,17,681 రూపాయలు, లిక్కర్ లీటర్లలో 6709 సుమారుగా అంచనా విలువ 31,89,467 రూపాయలు, సీజ్ చేసిన నగదు, లిక్కర్, గోల్డ్, ఇతర వస్తువుల విలువ మొత్తం విలువ 4,63,03,410 రూపాయలు.

లెసెన్సుడు ఆయుధముల డిపాజిట్

ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా నియామవళి అనుసారంగా లైసెన్స్ కలిగిన ఆయుధములు అన్నియు డిపాజిట్ కోరకు అండర్ సెక్షన్ 144 సిఆర్‌పిసి అనుసరించి నిషేదాజ్ఞలు జారీ చేయడం జరిగింది. ఇప్పటికే జిల్లాలో ఉన్న 44 ఆయుధాలు డిపాజిట్ కాబడినవిజిల్లాలో ఇప్పటివరకు 3418 వ్యక్తులను బైండోవర్ చేయబడ్డారని, గతంలో ఎలక్ట్రోరల్ నేరాలకు పాల్పడ్డ వ్యక్తులను అందులో సహకరించిన వ్యక్తులను బైండోవర్, రౌడీషీట్ కలిగిన వారిని ముందస్తుగా బైండోవర్ చేయడం జరిగిందన్నారు.ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై కఠినంగా ఉన్నామన్నారున. ఎన్నికల కోడ్ అమలులో వచ్చిన రోజు నుండి ఇప్పటి వరకు జిల్లాలో ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసులు 40 నమోదు కావడం జరిగిందని, ఈయొక్క కేసులకు సంబంధించి దర్యాప్తు త్వరగా పూర్తి చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికల కమీషన్ ఆదేశించిన ఎన్నికలు నియమావళి పాటిస్తూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పి కోరారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకుని వెళ్లున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100 కి లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడిన, ఎన్నికల నియమావళి ప్రకారం చట్ట రిత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

శాంతియుత వాతావరణంలో పోలింగ్

- 1700 పైగా సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు

రాజన్న సిరిసిల్ల, నవంబర్, 29 (మనం న్యూస్): నేడు జరిగే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పటిష్ట నిర్వహణ కోసం భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం రోజున సిరిసిల్ల పట్టణంలోని కాలేజ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ఎన్నికల రోజు,ఎన్నికల తరువాతపోలీసుల నిర్వహించాల్సిన బందోబస్తు విధులపై పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు తెలియజేశారుజిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగే విధంగా పటిష్ట భద్రత చర్యలు చేపట్టామని,జిల్లాలో ఉన్న 560 పోలింగ్ కేంద్రాల్లో సుమారుగా 1700 మందికి పైగా భద్రతా విధులలో పాలుపంచుకోన్నట్లు తెలిపారు. అలాగే పోలింగ్ స్టేషన్ల వద్ద విధులు నిర్వహించే అధికారులకు సిబ్బందికి పలు సూచనలు తెలియజేశారు. అనంతరం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ఎన్నికల రోజు, ఎన్నికల తరువాత పోలీసుల నిర్వహించాల్సిన బందోబస్తు విధులపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ అధికారులకు,సిబ్బందికి పలు సూచనలు తెలియజేశారు. ప్రతి పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అన్ని సౌకర్యాలు ఉండేలా సంబంధిత అధికారులతో మాట్లాడి సరిచూసుకోవాలని, ఓటర్లు క్యూలైన్లు పాటించే విధంగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు.రూట్ బందోబస్తు ,పెట్రోలింగ్ పార్టీలు ఈ రోజు నుండి వారికి కేటాయించిన రూట్ లలో, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు గల రూట్‌లలో ప్రత్యేక దృష్టి సారించాలని,ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై నిఘా పెట్టాలని శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ,ఎవరైనా ఎన్నికల ఉల్లంఘనకు పాల్పడినట్లయితే తక్షణమే సంబంధిత పై అధికారులకు తెలపాలని అన్నారు. ఓటర్లకు భరోసా కలిగించే విధంగా ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వహించాలని పోలీస్ అధికారులకు, సిబ్బందికి తెలిపారు.ఆయన వెంట సిరిసిల్ల అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్, సిరిసిల్ల డిఎస్పీ ఉదయ్ రెడ్డి, వేములవాడ డిఎస్పి నాగేంద్ర చారి, సిరిసిల్ల పట్టణ సిఐ ఉపేందర్, వేములవాడ పట్టణ సిఐ కరుణాకర్ ఎస్ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సిపి అభిషేక్ మొహంతి

కరీంనగర్‌క్రైం, నవంబర్29(మనం న్యూస్) :ఎన్నికలవేళ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలగకుండా తీసుకునే ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా బుధవారం కరీంనగర్ కమిషనరేట్ లోనిపలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి స్వయంగా పరిశీలించారు. దీనిలో భాగంగా మానకొండూరు మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మరియు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద స్థానిక పోలీసులతో పాటు కేంద్ర సాయుద బలగాలను విధులకై కేటాయించమన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న సిబ్బందికి నిర్వహించవలసిన విధుల పట్ల పలు సూచనలు చేశారు. గతంలో జరిగిన సంఘటనల ఆధారంగా స్థానిక ప్రిసైడింగ్ అధికారులకు, పై పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారని తెలిపారు. పోలింగ్ రోజున ఏదైనా శాంతి భద్రతల సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా సహకరించి విధులు నిర్వర్తించాలన్నారు

త్వరలోనే సంజయ్, కమలాకర్ బండారాలను బయటపెడతాం

- గంగుల కు ఓట్లు వేయడానికి మైనారిటీ ప్రజలు దూరంగా ఉన్నారు
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్

కరీంనగర్ కలెక్టరేట్,నవంబర్ 29 (మనంన్యూస్): త్వరలోనే బండి సంజయ్, గంగుల కమలాకర్ బండారాలను బయటపెడతానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్ అన్నారు.బుధవారం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో అత్యవసరంగా పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పురుమల్ల శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూవక్ఫ్ బోర్డ్ భూములను ఖబ్జా చేసిన గంగుల కమలాకర్ కు ఓట్లు వేయడానికి మైనారిటీప్రజలు దూరంగా ఉన్నారని తెలిపారు.తమ భూములను కబ్జా చేసిన గంగుల కమలాకర్ ను ఓడిస్తామని ప్రతిజ్ఞ చేసిన ఎంఐఎం నేతలు ఇప్పుడు ఎందుకు అతనికి మద్దతు ఇస్తున్నారని ప్రశ్నించారు.పేద ప్రజలకు చెందిన కాళీ జాగా కనిపిస్తే చాలు గంగుల అనుచరులు కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు .ఓటర్లకు డబ్బులు పంచుతూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.మూడుసార్లు నియోజకవర్గాన్ని గంగుల అభివృద్ధి చేస్తే గంగుల ఇప్పుడు ఓటమి భయంతో డబ్బులు ఎందుకు పంచుతున్నట్లని ప్రశ్నించారు. సర్పంచ్ స్థాయి నుండి ప్రజాదరణతో కరీంనగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే స్థాయికి ఎదిగిన నాపై గంగుల కమలాకర్, బండి సంజయ్ లు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు.మంత్రి గంగుల కమలాకర్ బండి సంజయ్ కు పరోక్షంగా సహకరిస్తున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో బండి సంజయ్ ని గెలిపించి బిజెపి పార్టీలోకి పోయి తిరిగి ఎంపీగా పోటీ చేసే ఆలోచనతో గంగుల కమలాకర్ ఉన్నారన్నారు.తన ఎదుగుదలను చూసి ఓర్వలేక ఒక బలహీన వర్గానికి చెందిన నాపై కక్ష పూరితంగా కేసులు పెట్టి 72 రోజులపాటు జైల్లో పెట్టి నా భార్య పిల్లలకు నన్ను గంగులదూరం చేశారని మండిపడ్డారు. గంగులఅతని అనుచరుల వల్ల నష్టపోయి ప్రజల ముందుకు చెప్పుకోలేక బాధలు అనుభవిస్తున్న వారు ఎంతోమంది ఉన్నారని తెలిపారు.టికెట్ ఆలస్యంగా రావడం వల్లనియోజకవర్గంలో ప్రతి గడపకు చేరలేకపోయానని తెలిపారు.త్వరలోనే బండి సంజయ్ గంగుల కమలాకర్ బండారాలను స్కాములను, రహస్య ఒప్పందాలను, వ్యాపారాలను బయటపెడతానని తెలిపారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ టి సంతోష్ కుమార్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్, డిసిసి ప్రధాన కార్యదర్శి ఎస్.కే. సిరాజ్ హుస్సేన్, మాజీ కార్పొరేటర్ ఆరీఫ్, నాయకులు పొన్నం మధు, తదితరులు పాల్గొన్నారు.

నా భర్త మృతికి కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ, శ్రీనివాస్‌లే కారణం

- ఫిర్యాదు చేసినా పోలీసులు ఎందుకు అరెస్టు చేయడం లేదు
- పోలీసు అధికారులు స్పందించి న్యాయం చేయాలి

కరీంనగర్ కలెక్టరేట్,నవంబర్29(మనంన్యూస్):తన భర్త నాయిని శ్రీనివాస్ మరణానికి కారణమైన కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ, ఆమె భర్త శ్రీనివాస్‌ల పై కరీంనగర్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికి ఎందుకు అరెస్టు చేయడం లేదని నాయిని సరిత తెలిపారు. బుధవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లోఆమె విలేకరుల సమావేశంలో మాటాడుతూ కార్పొరేషన్ ఎన్నికల సమయంలో కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ, ఆమె భర్త శ్రీనివాస్ ల తన భర్త వద్ద నుంచి ఖర్చుల నిమిత్తం 8 లక్షల 50వేలరూపాయలు, మూడున్నర తులాల బంగారం తీసుకున్నారని, తిరిగి డబ్బులు అడిగితే వారు ఇవ్వమని.ఏం చేసుకోకుంటావో చేసుకోమని, మళ్లీ అడిగితే నిన్ను, నీ భార్యను, పిల్లలను చంపేస్తామని బెదిరింపులు, వేధింపులకు గురి చేయడంతోతన భర్త ఆత్మహత్యకు పాల్పడి మరణించారని తెలిపింది. ఇట్టి విషయంలో రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినప్పటికి కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్ ను ఇప్పటి వరకు అరెస్టు చేయలేదన్నారు. మంత్రి గంగుల కమలాకర్ అండదండలతోనే పోలీసులు అరెస్టు చేయడం లేదా? తన భర్త మరణానికి కారణమైన కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ, ఆమె భర్త శ్రీనివాస్ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని తెలిపారు. పోలీసులకు కంటికి కనబడినా ఎందుకు అరెస్టు చేయడం లేదన్నారు. తమ వద్దనే డబ్బులు తీసుకొని తన భర్త మరణించాక మాకు డబ్బులు, బంగారం ఇవ్వలేదని, గత నాలుగు రోజుల క్రితం మీడియా సమావేశంలో చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. తన భర్త వద్ద డబ్బులు తీసుకున్నట్లు చెక్ ఉన్నప్పటికి నా సంతకం కాదని అనడం సరైంది కాదన్నారు. గుగ్గిళ్ల జయశ్రీ, శ్రీనివాస్ వేధింపులతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడన్నారు తమకు నాకు ఇద్దరు పిల్లలు శ్రీనిక(5), మనస్విన్(3) ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ, శ్రీనివాస్ ను అరెస్టు చేసి నా కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నాను.

గల్ఫ్ బాధితుడికి వైద్యం కోసం రూ. 1.32 లక్షలు సాయం

ధర్మపురి,నవంబర్ 29, (మనం న్యూస్): కుటుంబ పోషణ కోసం దుబాయ్ వెళ్లిన ఓ గల్ఫ్ కార్మికుడు, సరైన ఉపాధి లేక ప్రదేశానికి తిరిగి రాగానే బ్రెయిన్ స్ట్రోక్ గురై కాలు చెయ్యి పడిపోగా మంచానికే పరిమితమైన గల్ఫ్ బాధితుడికి వైద్య ఖర్చులకోసం ఫేస్ బుక్ మిత్రులు రూ. 1.32 లక్షలు సాయం అందించి తమ ఔదార్యం చాటుకున్నారు .వివరాలిలా ఉన్నాయి. ధర్మపురి మండల కేంద్రంలోని నక్కల పేట గ్రామానికి వెళ్లే ఇందిరమ్మ కాలనీకి చెందిన దివిటి సురేష్ తన భార్య కూతురుతో కలిసి నివసిస్తుండగా కొన్ని నెలల క్రితం సురేష్ ఉపాధి కోసం దుబాయ్ వెళ్ళాడు.అక్కడ సరిగా పని దొరకకపోవడంతో 6 నెలల క్రితం తిరిగి ఇంటికి వచ్చాడు. దురదృష్టవశాత్తు 4 నెలల క్రితం సురేష్ కు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఓ కాలు, చెయ్యి పడిపోగా మంచానికే పరిమిత మయ్యాడు .వైద్యం కోసం సుమారు నాలుగు లక్షలు అప్పు చేసినప్పటికీ పూర్తిగా నయం కాలేదు. చివరికి డబ్బులు లేక వైద్య సేవలు నిలిచిపోయాయి. బాధితుడి కుటుంబ దిన స్థితిని ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ స్థానికుల ద్వారా తెలుసుకొని సురేష్ కు వైద్య ఖర్చులకోసం సాయం అందించాలని కోరుతూ నవంబర్ 4న ఫేస్ బుక్ లో పోస్ట్ చేసాడు.రమేష్ చేసిన ఫేస్ బుక్ పోస్టుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన బళ్లారి మిత్రులు స్పందించి సురేష్ బార్య రాణి బ్యాంక్ ఖాతాకు రూ. 1.32లక్షలు పంపించారు.దాతలు అందించిన విరాళాలను రమేష్ స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ రవితేజ చేతుల మీదుగా సురేష్ భార్యకు అందించారు.

నేడు వేతనంతో కూడిన సెలవు

- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
- అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హేమలత

మంథని, నవంబర్ 29,(మనం న్యూస్) : తెలంగాణలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గురువారం వేతనంతో కూడిన సెలవు ఉంటుందని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హేమలత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.మంథని నియోజకవర్గంలో వ్యాపార వ్యాణిజ్య సంస్థలో పనిచేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ప్రభుత్వ ప్రకటించిందని నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.భవన నిర్మాణ,అన్ని రంగాలలో పనిచేసే టువంటి కార్మికులు స్వచ్ఛందంగా ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని ఆమె సూచించారు.ఎన్నికల సందర్భంగా కార్మికులపై ఒత్తిడి చేసినటువంటి యాజమాన్యం పైన కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం

- కేసీఆర్ కొట్లాడితే వచ్చింది కాదు తెలంగాణ..
- తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే
- బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ దోపిడికి గురైంది
- గజ్జలకాంతం, జెపిసి చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నేత

కరీంనగర్, నవవంబర్ 29 (మనంన్యూస్) : కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం అని కాంగ్రెస్ నాయకులు గజ్జెల కాంతం అన్నారు. బుధవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తిరిగి ఆహ్వానించడం సొంతింటికి చేరుకున్నట్టుందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ కోసం ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు, విద్యార్థిసంఘాలు అనేక వర్గాలు ఏకతాటి పైకి వచ్చి ఉద్యమిస్తే సోనియా గాందీ తెలంగాణ ఇచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన వారిని సీఎం కేసీఆర్ తన పక్కన కూర్పొబెట్టుకున్నారని విమర్శించారు. గంగుల కమలాకర్ పాడికౌశిక్ రెడ్డితో పాటు చాలా మంది తెలంగాణ వ్యతిరేకులే అని ఆరోపించారు. బీఆర్ఎస్ బీజేపీ పార్టీలు రెండు ఒక్కటేనని చీకిటి ఒప్పందం చేసుకోన్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ దోపిడికి గురైందన్నారు. కేసీఆర్ లక్షల కోట్లు ఆస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. మోడీ అధికారంలోకి వచ్చాక తెలంగాణ పై ఉన్న అక్కసును వెల్లగక్కారని తెలిపారు. తెలంగాణ మీద మోడీకి ఎలాంటి ప్రేమ లేదన్నారు. మోడీ చిన్నరాష్ట్రల ఏర్పాటుకు వ్యతిరేకి అని విమర్శించారు. మోడీకి, కేసీఆర్ లక్ష్యం దేశంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు కుతంత్రులు చేసిన ప్రజస్పందనను ఎవర అపలేరని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటవ్వడంతోనే తాను కాంగ్రెస్ సొంతగూటికి చేరుకున్నట్లు తెలిపారు. ఉద్యమకారునిగా తెలంగాణకు అన్యాయం చేయాలని చూస్తే ఉరుకునేదిలేదన్నారు. కరీంనగర్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న బీజేపి, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. అందులో బాగంగానే బీఆర్ఎస్ అభ్యర్థి తను అనుచరవర్గాన్ని బీజేపిలోకి పంపిచారని ఆరోపిం చారు. కరీంనగర్లో యువత డ్రగ్స్, గంజాయికి అలవాటు పడ్డా యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మన పిల్లల ఈ అలవాట్లకు కారకులు ఎవరో తెలుసుకోని ఈ ఎన్నికల్లో వారికి బుద్ధి చెప్పాలన్నారు. మంత్రి గంగుల కమలాకర్ ప్రభుత్వ యంత్రంగాని ఏజెంటుగా పెట్టుకున్నారని ఆరోపించారు. గంగుల కమలాకర్ కనుసైగల్లోనే అక్రమ ఇసుక, గ్రానైట్ రవాణా జరుగుతు ందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని మార్పు ఖచ్చితంగా జరిగితీరుతుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నముద్రాల లక్ష్మణ్, బోనాల సంపత్ కుమార్, మీసాల సాయిలు, అవారు లత, మాతంగి సతీష్, తప్పట్ట అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి విధుల పట్ల అవగాహన

హుజురాబాద్ టౌన్,నవంబర్29(మనంన్యూస్) :హుజురాబాద్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు ఎన్నికల విధుల కోసం కేటాయించబడిన సిబ్బందితో, నిర్వహించవలసిన విధుల గురించి బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఐ.పి.ఎస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు.ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజు చాలా కీలకమన్నారు. సిబ్బందికి కేటాయించబడ్డ విధులను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ ప్రారంభమయ్యే సమయం కంటే ఒక గంట ముందుగానే విధులకు సిద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ బూత్ వద్ద ఇతర శాఖల సిబ్బందితో సమన్వయంగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ బూత్ వద్ద విధుల్లో ఉండే సిబ్బంది సంబంధిత రూట్ ఆఫీసర్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారుల యొక్క ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే ఏదైనా సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందించాలన్నారు. స్థానిక ప్రజలు, ఓటర్లతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలి అన్నారు. పోలీసు సిబ్బంది ప్రవర్తనతో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ బూత్ లోకి అనుమతి లేని పరికరాలు స్తువులను ఓటర్లు పోలింగ్ బూత్ లోనికి తీసుకెళ్లకుండా చూడాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగే విధంగా విధులు నిర్వహించాలన్నారు.

ఎన్నికల వేళ తనిఖీలు ముమ్మరం



చిగురుమామిడి,నవంబర్29(మనంన్యూస్): శాసనసభ ఎన్నికల వేళ కేంద్ర ఎన్నికల సంఘం ప్రలోభాలపర్వంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. దేశంలోనే ఖరీదైన ఎన్నికలు ఎక్కడంటే తెలుగు రాష్ట్రాల్లో అని చెప్పే పరిస్థితి వచ్చిందని సాక్షాత్తూ ఈసీ వ్యాఖ్యానించే పరిస్థితి వచ్చింది.కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు, హెచ్చరికలతో ముందు నుంచే రాష్ట్రంలో తనిఖీలను ముమ్మరం చేశారు.ప్రచారం ముగిసినందున ప్రలోభాలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే రాష్ట్రంలో పలు చోట్ల డబ్బు, మద్యం పంపిణీ ఘటనలు వెలుగు చూస్తున్నాయి. దీంతో మరింత అప్రమత్తంగా ఉంటున్నట్లు అధికారులు తెలిపారు.ఇందులో భాగంగా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామ శివారునందు ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని నిశితంగా పోలీసులు తనిఖీ చేస్తున్నారు.

స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఓటింగ్‌కు సర్వం సిద్ధం

- కలెక్టర్ శివలింగయ్య

స్టేషన్ఘన్పూర్, నవంబర్ 29, మనం న్యూస్ : స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గంలోని మొత్తం మండలాలు 09 మొత్తం ఓటర్లు: మంది2,49,155 పురుషులు మంది1,23,675 మహిళలు మంది1,25,479 ఇతరులు 01 మొత్తం పోలింగ్ స్టేషన్లు 290 పోలింగ్ టీంలు 290 పోలింగ్ సిబ్బంది, వివోలు 349 ఏపీఓ లు 349 ఓపిఓ లు 698 రూట్ సెక్టార్ అపిసర్లు 35 రిజర్వ్ సమస్యాత్మక కేంద్రాలు అసెంబ్లీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాన్ని ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ శివ లింగయ్య పర్యవేక్షించి ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఎన్నికల సిబ్బంది, ఎన్నికల ఈవిఎం లు ఇతర ఎన్నికల సామగ్రి పోలింగ్ కేంద్రాలకు సురక్షితంగా తరలించేందుకు పోలింగ్ పూర్తి చేసుకుని తిరిగి రేసిప్షన్ కేంద్రానికి తిరిగిచేరుకునేందుకు తగిన సలహాలు సూచనలు జారీ చేసినారు. మంగళవారం కేంద్రంలోని అధికారులతో ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రవీష్ గుప్త ఐఎ ఎస్తారు రిటర్నింగ్ అధికారి ఘనపూర్ యుక్తంగా ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల విధులు పడిన మైక్రో అబ్జర్వర్ లకు ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ను క్షుణ్ణంగా పరిశీలించాలని తగు సూచనలు జారీ చేసినారు. ఇట్టి సమావేశంలో ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రిటర్నింగ్ అధికారి ఘన్పూర్ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి ఘన్పూర్ నియోజకవర్గంలో విధులు నిర్వర్తించు మైక్రో అబ్జర్వర్ అధికారులు పాల్గొన్నారు. అరో రామ్మూర్తి మాట్లాడుతూ ఉదయం నుండి సాయంత్రం వరకు అన్ని గ్రామాలకు బస్సులు వెళ్లే విధంగా ప్రణాళిక రూపొందించామని ఆయా గ్రామాలలో రేపటి రోజున ఓటింగ్ వేసేందుకు ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా టెంట్లో మంచినీటి లైటింగ్ గదులలో చీకటి ఉంటే లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. అదేవిధంగా పోలీసు

వ్యవస్థను బందోబస్తు ఏర్పాటు చేశామని నిత్యం ఎటువంటి పర్యవేక్షణ జరుగుతుందని ఏ పోలింగ్ కేంద్రంలోనైనా ఇబ్బందులు వెంటనే సమాచారం అందిస్తే అక్కడికి వెళ్తామని వారు తెలిపారు ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఉదయం నుండి జరిగే ఓటింగ్‌లో పాల్గొని ఓట్లు వేయాలని వారు తెలిపారు. డిప్యూటీ తాసిల్దార్ హరిప్రసాద్ అధికారులు పాల్గొన్నారు

పర్వతగిరి మండలంలో బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్

- కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ, వార్డ్ మెంబెర్స్, ముఖ్య నాయకులు

పర్వతగిరి, నవంబర్ 29, మనం న్యూస్ : మండలంలో బిఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. మంగళవారం వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్ నాగరాజు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అబ్రపూరి వెంకటేశ్వర్లు, మండల నాయకుడు పల్లెపాటి శాంతి రతన్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు మెచ్చి దౌలత్ నగర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ భాజీ, బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీటీసీ దూజ రవి, దౌలత్ నగర్ బిఆర్ఎస్ పార్టీ కీలక నేత దొనికి కొమురయ్య కుమారులు ధోనీకి రవి, రాజేందర్, 5 వ వార్డు మెంబర్ బర్ల స్వప్న ప్రవీణ్, 6 వ వార్డు మెంబర్ బర్ల వెంకన్న, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాలోత్ రవి తోపాటు బర్ల ఎల్లయ్య, ఐలపాక వెంకన్న, ఐలపాక బాబు, బర్ల అరుణ్, బర్ల స్వామి, బర్ల యాకన్న, ముక్కల రాజేందర్, అజ్మీరా తండా బిఆర్ఎస్ నాయకులు అజ్మీరా విజయ్, అజ్మీరా గురు, అజ్మీరా ప్రశాంత్ పెద్ద, అజ్మీరా ప్రశాంత్ చిన్న, ప్రశాంత్, అజ్మీరా భాస్కర్, అజ్మీరా రాజేందర్ ఎమ్మెల్యే అభ్యర్థి నాగరాజు స్వగహంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు ఆయన పార్టీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేఆర్ నాగరాజ్ కు పూల బోకె అందజేసి శాలువాతో సత్కరించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో భారీ మెజార్టీతో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు చేతి గుర్తుకు ఓటు వేసి ఆదరించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తుల శ్రీనివాస్, మండల సీనియర్ నాయకులు ధోనికి అశోక్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు

- డిసిపి సీతారాం

పాలకుర్తి, నవంబర్ 29, మనం న్యూస్ : నేడు నియోజకవర్గంలో జరిగే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జనగామ డిసిపి సీతారాం అన్నారు. బుధవారం నియోజక వర్గంలో జరగబోవు ఎన్నికల ప్రక్రియలో ఏర్పాట్ల ను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ వర్ధన్నపేట ఏసిపి ఎన్నికల నోడల్ అఫిసర్ రఘుచందర్ పాలకుర్తి వర్ధన్నపేట సిఐల పర్యవేక్షణలో దాదాపు 900 మంది పోలీసులు కేంద్ర సాయుధ బలగాలతో బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. వాటికీ సంబంధించిన బందోబస్తు పర్యవేక్షించుటకు డిసిపి జోన్ బి సీతారాం ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలతో సిబ్బందితో మాట్లాడి దిశా నిర్దేశం చేశారు. ఎలక్షన్‌లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రజలు ఓటర్లు సహకరించి ఎన్నిక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనగామ జోన్, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం

- కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య

జనగామ, నవంబర్ 29, మనం ప్రతినిధి : అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య, జిల్లాలోని మూడు నియోజకవర్గాలు (098) జనగామ, (100)పాలకుర్తి (099)స్టేషన్ ఘనపూర్ లలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి జరుగుతున్న పనులపై రిటర్నింగ్ అధికారి కార్యాలయాలు పంపిణి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిలాలో మూడు నియోజకవర్గాలలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర సాధారణ ఎన్నికల నిర్వహణపై తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు, ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. పంపిణీ కేంద్రాల ద్వారా ఎన్నికల సామాగ్రి పంపిణీ చేయడం జరుగుతుందని ఎన్నికల విధులలో పాల్గొని సిబ్బంది అధికారులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రతిక్షణం అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ పర్యవేక్షించారు. జనగామ జనరల్ అబ్జర్వర్ పిరమణ సరస్వతి, తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో సర్వేలను సిస్టం ద్వారా ఎఫ్ఎస్టి టీంల పనితీరు చెక్పోస్టుల నిర్వహణ పరిశీలించారు, నేడు జరగబోయే ఎన్నికలకు జిల్లాలో అన్ని విధాల సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు రోహిత్ సింగ్, మురళీ కష్ణ, రాంమూర్తి, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాపం ప్రభుత్వ ఉద్యోగుల ఆకలి కేకలు

- ఎన్నికల సామాగ్రి తరలింపు కేంద్రాల వద్ద అరకొర వసతులు
- భోజన వసతులు లేక ఉపాధ్యాయుల కష్టాలు
- ఖాళీ ప్లేట్లతో ఉపాధ్యాయుల నిరసన
- అన్నం లేక గడ్డ పెరుగుని భోజనంగా వాడుకున్న ఉపాధ్యాయులు

జనగామ, నవంబర్ 29, మనం ప్రతినిధి : అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల సామాగ్రి తరలింపు కేంద్రం వద్ద ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఏర్పాటుచేసిన అరకొర భోజన వసతులతో కడుపు మాడ్చుకుంటు డ్యూటీలు చేసే పరిస్థితి ఏర్పడింది. జనగామ జిల్లా వ్యాప్తంగా జిల్లా కేంద్రంలోని గురుకుల పాఠశాలలో నియోజకవర్గ ఎన్నికల సామాగ్రి తరలింపుకై వచ్చిన ఉద్యోగులకు నీటి ,భోజన వసతి సరైన సమయానికి ఏర్పాటు చేయకపోవడంతో పలు ఇబ్బందులు పడుతూ కడుపు మార్చుకుంటూ కుర్చీలలో కునుకు తీస్తున్నారు. సుమారుగా 1200 మంది ఉద్యోగులకు ఏర్పాటు చేయవలసిన భోజన వసతి 500 మందికి ఏర్పాటు చేయటంతో ఆకలితో ఉన్న ఉద్యోగులు ఒక్కసారిగా రావడంతో పలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అన్నం ఉంటే కూరలు లేక కూరలు దొరికితే అన్నం లేక ఇబ్బంది పడి కాలి ప్లేట్లతో నిరసన తెలిపారు. కొందరు ఉపాధ్యాయులు గడ్డ పెరుగునే భోజనంగా సరిపుచ్చుకొన్నారు. పలు ఆరోగ్య సమస్యలతో ఉన్న ఉపాధ్యాయులు భోజనం కోసం టెళ్లను ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కొందరు ఉద్యోగులు కాలి ప్లేట్లతో నిరసన తెలిపి వెళ్లిపోయారు. దూర ప్రాంతాల నుండి ఎన్నికల సామాగ్రి తరలింపు కేంద్రంకు వచ్చిన ఉద్యోగులకు మధ్యాహ్నం మూడు దాటిన భోజన వసతి సరైన సమయానికి పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో అన్నం దొరకక సల్ల తాగి సరిపుచ్చుకున్నారు. అన్నం తినడానికి కూరలు దొరకకపోవడంతో అన్నం అక్కడే వదిలి పెట్టి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు

- కేంద్ర సాధారణ ఎన్నికల పరిశీలకులు షణ్ముగ రాజన్
- రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ భాషాతో కలిసి డిస్ట్రిబ్యూషన్ పరిశీలన
- ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను తెలియజేసిన ఆర్ఓ

వరంగల్, నవంబర్ 29, మనం ప్రతినిధి : పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కేంద్ర సాధారణ ఎన్నికల పరిశీలకులు షణ్ముగ రాజన్ అన్నారు. బుధవారం ఎనుమముల మార్కెట్ యార్డ్‌లో కొనసాగుతున్న డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను సాధారణ పరిశీలకులు, ఆర్ఓ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఓ షేక్ రిజ్వాన్ భాషా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను గురించి తెలియజేస్తూ సాధారణ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా గురువారం రోజున పోలింగ్ నిర్వహించుటకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, నేడు (గురువారం) రోజున ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించు కోవచ్చునని, వరంగల్ (తూర్పు) నియోజకవర్గంలో మొత్తం 29 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని ఓటింగ్ ప్రశాంతంగా జరుగుటకు పోలిటికల్ పార్టీలు, ప్రజలు సహకరించాలని, నియోజకవర్గంలో మొత్తం ఓట్లర్లు 2, 54,641 మంది కలరని, అందులో పురుషులు 1,24,493, మహిళలు 1,29,810, ఉన్నారని, బుధవారం రోజున మార్కెట్ యార్డు గోదాం 11 లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో ఈవిఎంలు, వివి ప్యాట్ల పంపిణీ ఏర్పాట్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, మొత్తం సెక్టార్ లు 21, అందులో 3 రిజర్వు అని, 17 రూట్ లలో పోలింగ్ సిబ్బంది తోపాటు ఈవియం, వివి ప్యాట్‌లను సంబంధిత పోలింగ్ కేంద్రాలకు పోలీసు భద్రతతో తరలించడం జరిగిందని, 230 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్, 57 క్రిటికల్ పోలింగ్ స్టేషన్ లు, 110 మంది మైక్రో అబ్జర్వర్లు ను ఆలాట్ చేయడం జరిగిందని, పోలింగ్ అధికారులు 264, సహాయ పోలింగ్ అధికారులు 264, అదనపు పోలింగ్ అధికారులు 528 ఉన్నారని అన్నారు. మొత్తం పోలింగ్ సిబ్బంది 1056 ఉన్నారని అన్నారు. పోలింగ్ కు 575 బ్యాలెట్ యూనిట్స్, 287 కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్ లు 322 లు వినియోగించడం జరుగుతుందని, నియోజకవర్గంలో 5 చొప్పున మోడల్ పోలింగ్ కేంద్రాలను, 5 మహిళ పోలింగ్ కేంద్రాలు, 1 పిడబ్ల్యుడి పోలింగ్ కేంద్రం, 1 యూత్ పోలింగ్ కేంద్రం లను ఏర్పాటు చేయడం జరిగిందని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో ఆర్‌డిఓ వాసు చంద్ర, సెక్రెటరీ విజయ లక్ష్మి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఇక్బాల్, నాగేశ్వర్ రావు తోపాటు రెవిన్యూ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆమ్‌స్టర్‌డామ్‌లో గొప్ప దేవుని వాక్యాన్ని అందించిన డాక్టర్ జాన్ వెస్లీ



శ్రీనగర్ కాలనీ, నవంబర్ 29, మనం న్యూస్ : నెదర్లాండ్ లోని ఆమ్‌స్టర్‌డామ్‌లో దేవుని గొప్ప కదలిక ద్వారా డాక్టర్ జాన్ వెస్లీ ప్యూజన్ విజన్ ఇంటిమేషనల్ చర్చ్‌లో దేవుని వాక్యాన్ని అందించారు. చాలా మంది వాక్యము, ప్రార్థనల ద్వారా దేవుని మహిమను అందుకుని పునరుద్దరించబడ్డారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాని పరామర్శించిన జిల్లా మత్స్యశాఖ అధ్యక్షులు నీల రాజు

లింగాల గణపురం, నవంబర్ 29, మనం న్యూస్ : మండలంలోని జీడికల్ గ్రామంలో ముదిరాజ్ సొసైటీ అధ్యక్షులు నీల రాములు భార్య అనారోగ్యంతో మతిచేందగా జనగాం జిల్లా మత్స్యశాఖ అధ్యక్షులు నీల రాజు బుధవారం పరామర్శించారు. నీల రాములు కుటుంబానికి అండగా ఉంటాం అన్నారు. ఇతని వెంట మండల అధ్యక్షులు నీల గోపాల్, సహాయ కార్యదర్శినీల రమేష్, కాశబోయిన ప్రభాకర్ ఉన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

వర్ధన్నపేట, నవంబర్ 29, మనం న్యూస్ : వర్ధన్నపేట మండలం బొక్కలగూడెం గ్రామ బిఆర్ఎస్ బూత్ కన్వీనర్ ఇంట్లో ఫ్లయిం గ్ స్క్వాడ్ తనిఖీలు చేసి 7 లక్షల 50 వేల రూపాయల నగదు స్వాధీ నం చేసుకున్నారు. ఓటర్లకు పంచడానికి నగదు సిద్ధం చేసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. తక్కలపెల్లి వెంకటేశ్వరరావు, బత్తుల సాయి, మనోహర్ అనే ముగ్గురిపై కేసు నమోదు చేసిన వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ఎలుగుబంట్ల కలకలం

వర్ధన్నపేట, నవంబర్ 29, మనం న్యూస్ : వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటలో ఎలుగుబంట్ల కలకలం.. దారి తప్పి మూడు ఎలుగుబంట్లు ఏవిఎస్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలోకి రావడంతో వలలో చిక్కుకున్న ఓ ఎలుగుబంటి, వలలో చిక్కుకున్న పిల్ల ఎలుగుబంటి కోసం తల్లి ఎలుగుబంటి తల్లడింది. సంఘటన స్థలానికి అటవీశాఖ అధికారులు చేరుకున్నారు.

పల్లా గెలుపు కోసం 108 కొబ్బరికాయలతో ప్రత్యేక పూజలు

జనగామ, నవంబర్ 29, మనం ప్రతినిధి : స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో బిఆర్ఎస్ నాయకులు ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించాలని 108 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చింతకింది మల్లేష్, సొడ మహేష్, రఘు, ఠాకుర్, సుల్తాన్, గోవింద్ రెడ్డి, ఈగం శ్రీనివాస్, కొండ కిరణ్, రమేష్, మడూరి రాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు సకల ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని పి.ప్రావీణ్య

వరంగల్, నవంబర్ 29, మనం ప్రతినిధి : జిల్లాలోన్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని పి.ప్రావీణ్య పేర్కొన్నారు. మంగళవారం ఏనుమాముల మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన డిఆర్‌సి కేంద్రాల ద్వారా వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజక వర్గాలలోని పోలింగ్ కేంద్రాలకు, నర్సంపేట నియోజక వర్గానికి సంబందించిన పోలింగ్ మెటీరియల్ నర్సంపేట మార్కెట్ యార్డ్ డిఆర్‌సి సెంటర్ ద్వారా పోలీస్ భద్రత వాహనాలలో ఈవిఎంలతో సెక్టోరల్ అధికారులు, పోలింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులతో ఆయా పోలింగ్ కేంద్రాలకు ప్రశాంతంగా తరలించడం జరిగిందన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవిఎం యంత్రాలను సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలని, రిజర్వ్ ఈవీఎం యంత్రాలు, రిజర్వు పోలింగ్ సామాగ్రి సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉండాలని, సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల నియమ, నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ తెలిపారు.

ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు సకల ఏర్పాట్లు పూర్తి

- మూడు నియోజకవర్గాలలో 838 పోలింగ్ కేంద్రాలు
- ఓటర్లకు దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి
- ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు
- పోలింగ్ సామాగ్రి పంపణీ సమయంలో అప్రమత్తంగా ఉండాలి
- పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల తనిఖీ
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ఖాన్

పెద్దపల్లి,నవంబర్29(మనంప్రతినిధి):జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేష్ సింగ్రాణా, మంథని, పెద్దపల్లి ఎన్నికల సాధారణ పరిశీలకులు సి.ఎన్.శ్రీధర్లతో కలిసి రామగుండంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయ ఆవరణలో, మంథిని జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాల, పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవిఎం యంత్రాలను సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలని, రిజర్వ్ ఈవీఎం యంత్రాలు రిజర్వు పోలింగ్ సామాగ్రి సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉండాలని, సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల నియమ, నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మీడియా సమావేశంలో మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో 3అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 838 పోలింగ్ కేంద్రాలలో 7లక్షలకు పైగా ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. జిల్లాలో ఉన్న ఓటర్లందరూ తప్పని సరిగా నవంబర్ 30న పోలింగ్ కేంద్రానికి వచ్చి వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అన్ని వసతులు కల్పించామని, దివ్యాంగుల కోసం ర్యాంప్, ట్రై సైకిళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించామని తెలిపారు. జిల్లాలో అధిక పోలింగ్ నమోదయ్యే విధంగా విస్తృతంగా ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని అన్నారు. ఎన్నికలలో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్,రామగుండం రిటర్నింగ్ అధికారి జే.అరుణశ్రీ, పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి సీ.హెచ్.మధుమోహన్, మంథని రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్, మంథని ఆర్డీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటీవ్ అధికారి తూము రవీందర్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తరలిన పోలింగ్ సిబ్బంది

- 217 పోలింగ్ బూత్‌లు
- 1050 మంది పోలింగ్ సిబ్బంది
- నియోజకవర్గంలో 21 రూట్లు
- 59 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- పరిస్థితిని సమీక్షించిన రిటర్నింగ్ అధికారి వినోద్‌కుమార్

ఆర్మూర్,నవంబర్29(మనంన్యూస్): ఆర్మూర్ నియోజకవర్గంలో శాసనసభ ఎన్నికలలో భాగంగా ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఎన్నికల సామాగ్రి తీసుకుని ఎన్నికల సిబ్బంది బుధవారం మధ్యాహ్నం రూట్ల వారిగా గ్రామాలకు తరలి వెళ్లారు. ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆర్మూర్, ఆలూర్, డొంకేశ్వర్, నందిపేట, మక్లూర్ మండలాలతో పాటు ఆర్మూర్ పట్టణంలో 111 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో 217 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఎన్నికల సిబ్బందికి ఎన్నికల సామాగ్రి ఇవ్వడానికి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వినోద్‌కుమార్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీకాంత్‌లు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పరిస్థితిని సమీక్షిస్తూ సూచనలు చేశారు. నియోజకవర్గంలో 217 పోలింగ్ బూత్‌ల కోసం 1050 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. వీరిలో పివోలు 217 మంది, ఏపివోలు 217 ఇతర సిబ్బంది 434 మంది ఉన్నారు. వీరు కాక అదనంగా రిజర్వ్ ఎన్నికల సిబ్బంది ఉన్నారు. నియోజకవర్గంలో 21రూట్లను ఏర్పాటు చేసి, ఈ రూట్‌లలో 38 బస్సులను ఏర్పాటు చేశారు. 21 బ్యాలెట్ యూనిట్లు, 303 వివి ప్యాట్‌లను ఎన్నికల సిబ్బందికి అందజేశారు. ఈ వస్తువులను ఎన్నికల సిబ్బంది లెక్కించుకున్న తర్వాత భోజనాలు చేశారు. 59 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో 4గురు చొప్పున పారమిలిటరి బలగాలను నియమించారు.

పోలింగ్ కు సర్వం సిద్ధం

- సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా
- అసెంబ్లీ బరిలో 23 మంది
- రామగుండంలో 2,21,019 ఓట్లు



జ్యోతి నగర్, నవంబర్ 29, (మనం న్యూస్): రామగుండం నియోజకవర్గంలో 2,21,019 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈసారి కొత్తగా 15000 ఓట్లు నమోదు అయ్యాయి. ఇందులో పురుషులు 1,11,200, మహిళల ఓట్లు 1,09,794, ఇతరులు 25 మంది ఉన్నారు. నియోజకవర్గంలో రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాలు ఉన్నాయి. మూడు మండలాల్లో 260 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. 50 రూట్లుగా విభజించి బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రత్యేక బస్సుల్లో ఈవీఎంలను, ఎన్నికల సిబ్బందిని భారీ పోలీసు బందోబస్తు మధ్య తరలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో పాటు ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ తెలిపారు. రామగుండం అసెంబ్లీ ఎన్నికల్లో 23 మంది బరిలో నిలిచారు. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారాలు నిర్వహించి, తమ ఓటు బ్యాంకు ఎలా ఉందో గురువారం పరీక్షించుకోనున్నారు. నియోజకవర్గం బరిలో నిలిచిన అభ్యర్థుల భవిష్యత్తు రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని వివిధ పరిశ్రమల్లోని కార్మికుల ఓట్లపైనే ఆధారపడి ఉంది.

ఇస్రో శాస్త్రవేత్త చేత నాసా కిట్ల పంపిణీ

కరీంనగర్ కలెక్టరేట్,నవంబర్29 (మనంన్యూస్):స్థానిక నగరంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఇస్రో సైంటిస్ట్ ఎం వంశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన నాసా విద్యార్థులకు నాసా కిట్ల పంపిణీ చేశామని పాఠశాల ప్రిన్సిపల్ పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డీన్ సునీల్ కాంత్‌మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యా ర్థులకు అకాడమిక్స్ తో పాటు పాఠశాల స్థాయి నుండే స్పేస్ (అంతరిక్షానికి) సంబంధించిన ప్రాజెక్టులో పాల్గొని అంతర్జాతీయ స్థాయిలో ఎంపిక కావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజిఎం కరాజు కో ఆర్డినేటర్ ప్రవీణ్, సి బ్యాచ్ ఇంచార్జ్ మహేష్, నాసా ఇన్చార్జి రమేష్, ఏవో మనోహర్ రెడ్డి, పిఈటి శ్రీకాంత్, మరి యు విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

జ్యోతి నగర్, నవంబర్ 29, (మనం న్యూస్): జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేష్ సింగ్ రానా, మంథని, పెద్దపల్లి ఎన్నికల సాధారణ పరిశీలకులు సి.ఎన్.శ్రీధర్‌లతో కలిసి రామగుండంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఆవరణలో, మంథనిలో జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాల, పెద్దపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను బుధవారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ర్యాండ మైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవిఎం యంత్రాలను సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలని, రిజర్వ్ ఈవీఎం యంత్రాలు, రిజర్వు పోలింగ్ సామాగ్రి సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉండాలని, సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల నియమ, నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ తెలి పారు. అనంతరం మీడియాతో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజ మ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలో ఉన్న 3 అసెంబ్లీ నియో జకవర్గాల పరిధిలో మొత్తం 838 పోలింగ్ కేంద్రాలలో 7 లక్షలకు పైగా ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించు కునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. జిల్లాలో ఉన్న ఓటర్లందరూ తప్పనిసరిగా నవంబర్ 30న జరిగే పోలింగ్‌లో పాల్గొనేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చి, వారి ఓటు హక్కును విని యోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన త్రాగునీటి, టాయిలెట్ ఇతర వసతులు కల్పిం చామని అన్నారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రం వద్ద అవసరమైన ర్యాంప్, ట్రై సైకిళ్లు ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించామని తెలిపారు. జిల్లాలో అధిక పోలింగ్ శాతం నమోదయ్యే విధంగా విస్తృతంగా ఓటు ప్రాము ఖ్యతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని, జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలలో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎటువ ంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్య క్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం రిటర్నింగ్ అధికారి జే.అరుణశ్రీ, పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి సి.హెచ్. మధుమో హన్, మంథని రిటర్నింగ్ అధికారి హనుమానాయక్, మంథని ఆర్డీవో కార్యాలయ అడ్మిని స్ట్రేటివ్ అధికారి తూము రవీందర్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ ప్రవీణ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు మహాశయులారా కరుణ చూపరా

- నేడే ఎన్నికల పోలింగ్ ....ఉత్కంఠలో అభ్యర్థులు
- కౌన్ బనేగా బాద్‌షా..??

మంచిర్యాల, నవంబర్ 29 (మనం న్యూస్) : ఎన్నికల ప్రచారం ముగిసింది. ఇక ఈ.వి.ఎం .లలో ఓటర్లు తమ ఓట్లను వేసుకునే కార్యక్రమం మొదలు కాబోతోంది. ఓటరు దేవుళ్ళు ఎవరి తలరాతను ఎలా మలుపులుతిప్పుతారో, ఎవరిని భలకు పముపుతారో , ఎవరిని ఇంటికి పంపుతారో తేలనున్న రోజు ఈ రోజు. మంచిర్యాల జిల్లా పరంగా ఎన్నికలు సజావుగా సాగాడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ అనే మూడు నియోజకవరాల్లో మొత్తం 743 పోలింగ్ స్టేషన్ లను ఏర్పాటు చేశారు. మంచిర్యాల నియోజకవర్గంలో 289, బెల్లంపల్లిలో 227, చెన్నూర్ 227 చొప్పున పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయి. ఇక ఓటర్ల పరంగా మంచిర్యా లనియోజకవర్గంలో పురుషులు 1,31,871 మంది కాగా, మహిళలు 1,32,292 మంది , ఇతరులు 23 మంది , మొత్తం 2,64,186 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గం 2009 లో అప్పటి లక్షెట్టి పేట నుంచి 2004 లో మంచిర్యాల నియజవర్గంగా మారింది. ఇక్కడ 1983 నుంచి 2004 వరకు పరిశీలిస్తే కాంగ్రెస్ పార్టీ నాలుగు సార్లు గెలిచిన దాంట్లో జి.వి.సుదాకర్ రావు,నడిపెల్లి దివాకర్ రావులు ఎమ్మెల్యేలు అయ్యారు. తెలుగు దేశం తరపున రెండు సార్లు గెలవగా ,మురళి మనోహర్ రావు, గొనె హన్మంత రావులు ఎమ్మెల్యేలు అయ్యారు.ఇక బారాస పార్టీ నుంచి బై ఎలక్షన్ తో కాళీ నాలుగు సార్లు కొత్తగా ఏర్పడిన మంచిర్యాల నియజవర్గం నుంచి గడ్డం అరవింద రెడ్డి, నడిపెల్లి దివాకర్ రావులు ఎమ్మెల్యేలు అయ్యారు. ఇక బెల్లంపల్లి నియోజకవర్గంలో పురుషులు 84,790 మంది ఉండగా , మహిళలు 84,796 మంది , ఇతరులు 12 మంది , మొత్తంగా 1,69,598 ఓటర్లు తమ ఓటు హాక్కును వినియోగించు కోనున్నారు. ఇక చెన్నూర్ నియోజకవర్గంలో పురుషులు 91,969 కాగా , మహిళలు 92,147 మంది, ఇతరులు 7 గురు, మొత్తంగా 1,84,117 ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గం అప్పటి ఆసిఫాబాద్ నుంచి విడిపోయి కొత్తగా 2009 ఏర్పాటు అయింది. అప్పటి ఆసిపాబాద్ లో 1972 నుంచి ఎన్నికల వరకు ఎస్.టి.లకు, 1978 నుంచి ఎస్.సి లకు రిజర్వేషన్ గా మారింది. 1978 నుంచి 2004 వరకు కాంగ్రెస్ పార్టీ రెండు సార్లు గెలవగా దాసరి నర్సయ్య ఎమ్మెల్యే అయ్యారు. తెలుగుదేశం పార్టీ నుంచి రెండు సార్లు అదీ ఇద్దరు మహిళలు గెలిచారు. పాటి సుభద్ర, అమురాజుల శ్రీదేవి లు ఎమ్మెల్యేలు అయ్యారు. కమ్యూనిస్ట్ పార్టీ నుంచి గుండా మల్లేష్ రెండు సార్లు ఎమ్మెల్యే అయ్యారు. 2014, 2018 ఎన్నికల్లో అప్పటి తెరాస ఇప్పటి బిఆర్ఎస్ తరపున దుర్గం చిన్నయ్య గెలిచారు. ఇక చెన్నూర్ నియోజకవర్గంలో పురుషులు 91,969 మంది ఉండగా , మహిళలు 92,147 మంది, ఇతరులు 7 మంది, మొత్తంగా 1,84,117 ఓటర్లు తమ ఓటు హాక్కును వినియోగించు కోనున్నారు. ఈ నియోజకవర్గం 1962 లో ఉమ్మడిగా ఉన్న నియోజకవర్గం నుంచి విడిపోయి స్వతంత్ర నియోజకవర్గం గా ఏర్పడింది .ఈ ఎస్ సి నియోజవర్గం లో 1983 నుంచి 2018 వరకు కాంగ్రెస్ పార్టీ రెండు సార్లు గెలువగా సోతుకు సంజీవరావు గడ్డం వినోద్ ఎమ్మెల్యేలు అయ్యారు.ఇక తెలుగుదేశం పార్టీ నుంచి నాలుగు సార్లు గెలిచి బోడ జనార్ధన్ ఎమ్మెల్యే అయ్యారు, మంత్రి కూడా అయ్యారు. ఇక 2009 నుంచి 2018 లో జరిగిన బై ఎలక్షన్ లతో కలిపి జరిగిన ఎన్నికల్లో అప్పటి తెరాస ఇప్పటి ఆర్ఎస్ నాలుగు సార్లు గెలువగా నల్లాల ఓదెలు మూడు సార్లు , బాల్క సుమన్ ఒక్కసారి ఎమ్మెల్యేలు అయ్యారు. మరి 30,నవంబర్ 2023 న జరిగే ఈ ఎన్నికల్లో పోటి రసవత్తరంగా ఉన్నది.బిఆర్ఎస్,కాంగ్రెస్ , బిజెపి తో పాటు బిఎ స్పి అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించు కో బోతున్నారు.గత ఎన్నికల కు భిన్నంగా ఈ సారి ప్రచారం తారా స్థాయిలో జరిగింది .మరి ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడిపోతారో ప్రజలే తీర్పు డిసెంబర్ మూడున వెలువడే పలితాల్లో తేలిపోతుంది .

అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగిన సిద్దేశ్వర స్వామి కొండ

చిగురుమామిడి,నవంబర్29(మనంన్యూస్): అయ్యప్ప స్వాముల నామస్మరణతో సిద్దేశ్వర కొండ ఆలయ ప్రాంగణంలో స్వామివారి శరణు ఘోషతో మారు మ్రోగాయి. హుస్నాబాద్ పట్టణంలోని సిద్దేశ్వర స్వామి కొండపైనున్న అయ్యప్ప స్వామిమాల వేసుకున్న భక్తులకు కరీంనగర్ వాస్తవ్యులు సాయి లేఖ రాజ్, విజయ ఆధ్వర్యంలో అయ్యప్ప ఆలయంలో అన్నదానం రత్నబిక్ష ఏర్పాటు చేశారు.ఈ నెల 25 నుండి ప్రారంభమైన బిక్ష జనవరి ఒకటో తారీకు వరకు భిక్ష స్వాములకు ఉంటుందని అయ్యప్ప స్వామి ఆలయ నిర్వాహకులు తెలిపారు. అలాగే డిసెంబర్ రెండవ శుక్రవారం రోజున పంబా రట్టు ఈ క్రమంలో డిసెంబర్ 26న రాత్రి హరిహరపుత్ర అయ్యప్ప స్వామి మండల పూజ మహోత్సవం ఉంటుందని ఆలయ చైర్మన్ ఆకుల వెంకన్న, గౌరవ అధ్యక్షులు సుద్దాల చంద్రయ్య, ఆలయ పర్యవేక్షకులు వడ్డేపల్లి వెంకటరమణ తెలిపా రు.అన్నదానం నిర్వహించేవారు 5వేల16 రుసువులు చెల్లించి, తమ గోత్ర నామాలు నమోదు చేసుకోవాలని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆకుల వెంకట్, ఆలయ గౌరవ అధ్యక్షులు సుద్దాల చంద్రయ్య ,పర్యవేక్షకులు వడ్డేపల్లి వెంకటరమణ, ఆలయ అర్చకులు భానుమూర్తి,గురుస్వాములు శేషం నరసింహచార్యులు, గోగురి సంపత్ రెడ్డి హనుమంత రెడ్డి మణికంఠ రెడ్డి, బొల్లి శ్రీనివాస్ ప్రేమ్ కుమార్, నరేందర్, శివ కుమార్, రామస్వామి, తదితరులు అయ్యప్ప స్వామి భక్తులు ఉన్నారు ఈరోజు, బిక్ష దాత కరీంనగర్ చెందిన, గా రోజు సాయి లేఖ రాజ్ విజయ రత్న భిక్షతాతక వ్యవహరిం చారువ్యవహరించారు.

జిల్లాలో పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం

- కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ బ్యూరో,నవంబర్29(మనంన్యూస్):జిల్లాలో పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధంచేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు.బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జిల్లాలోని4 నియోజకవర్గాలు కరీంనగర్, చొప్పదండి, మానకొండూరు, హుజురాబాద్‌లలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ మరియు రిసెప్షన్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 4 నియోజకవర్గాలలో జరుగు అసెంబ్లీ సాధారణ ఎన్నికల నిర్వహణ పై తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు, ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు.పంపిణీ కేంద్రాల ద్వారా ఎన్నికల సామాగ్రి పంపిణీ చేయడం జరుగుతుందని ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బంది అధికారులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రతిక్షణం అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజరాబాద్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మహేశ్వర్, ప్రపుల్‌దేశాయ్, లక్ష్మీ కిరణ్, రాజుఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోలింగ్‌కు అన్ని ఏరాట్లు సర్వం సిద్ధం

- ఉదయం 7 నుంచి 4 వరకే పోలింగు
- మూడు నియోజకవర్గాల్లో 743 పోలింగ్ పోలింగు బూతులు
- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ధారవత్ సంతోష్

మంచిర్యాల,29 నవంబర్(మనం న్యూస్):నేడు అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధం అయింది. మంచిర్యాల జిల్లలో ఉన్న మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ అనే మూడు నియోజకవరాల్లో జరిగే పోలింగు కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి ,జిల్లా కలెక్టర్ ధారవత్ సంతోష్ తెలిపారు. మంచిర్యాల జిల్లా లో మొత్తం 743 పోలింగ్ పోలింగుబూతులు ఉన్నాయని అన్నారు. మంచిర్యాల నియోజకవర్గం లో 289, బెల్లంపల్లి లో 227, చెన్నూర్ 227 చొప్పున ఉన్న పోలింగ్ స్టేషన్ లలో ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగు నిర్వహణకోసం సిబ్బందికి రెండు దఫాలుగా శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు. అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, పోలింగ్ శతం పెరగడానికి , ప్రతి ఒక్కరు బూతు వాడకు వచ్చి స్వేచ్ఛగా వారి ఓటు వేసుకునెందుకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని అన్నారు. సమస్యాత్మక కేంద్రాలైన ఈ మూడు నియోజక వర్గాల్లో ప్రశాంతంగా ఓటు పడేలా చారలు తీసుకున్నామని , ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటలవరకు మాత్రమె పోలింగ్ జరుగుతుందని , ఓటర్లు నిర్ణీత సమయం లోగా అందరు తమ ఓటును వేసుకోవాలని సూచించారు. ఈ.వి.ఎం.లలో సమయాలు ఏమైనా తలెత్తితే వెంటనే చర్యలు తీసుకుని కేవలం 10 నిమిషాల్లో రెడ్డిపై చెపిస్తామన్నారు. సిబ్బంది కొరత లేదని 120 శాతం సిబ్బంది ఉన్నారని , అనుకోని కారణాల కారణంగా కొంత మంది గైర్హాజరు అయినా సమస్య లేదని అన్నారు.ఎలాంటి ప్రలోభాలకు లొంగ కుండా ఆలోచించి పోలింగ్ స్టేషన్ వద్దకు వచ్చి ఖచ్చితంగాఓటు వినియోగించుకోవాలనిఆయన కోరారు.

సార్వత్రిక పోలింగ్‌కు.... రంగం సిద్ధం

- నాలుగు నియోజకవర్గాలలో 92 మంది అభ్యర్థులు బరిలో
- మొత్తం సెగ్మెంట్లలో 9,86,536 ఓటర్లు
- జిల్లా వ్యాప్తంగా 1201 పోలింగ్ కేంద్రాలు
- సమస్యాత్మక ప్రాంతాలుగా 173 గుర్తింపు
- 3500 మందితో పోలీసు బలగాలు పటిష్ట బందోబస్తు
- ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు ఈవిఎంలతో చేరుకున్న సిబ్బంది

- ఎలాంటి అవాంఛిత సంఘటనలు చోటు చేసుకోకుండా నిఘా నేత్రాలు

సూర్యాపేట నవంబర్ 29, మనం ప్రతినిధి: జిల్లా కేంద్రం నుండి గురువారం జరుగబోయే శాసన సభ ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో భద్రపరిచిన పోలింగ్ సామాగ్రితో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ముందస్తుగానే ప్రణాళిక ప్రకారం రూట్ మ్యాప్‌ను తయారు చేసుకుని, దానికి అనుగుణంగానే బస్సులు, ఇతర వాహనాలలో ఎన్నికల సామాగ్రితో సిబ్బంది జిల్లాలోని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. సూర్యాపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో మొత్తం 9,86,536 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే జిల్లాలోని నాలుగు సెగ్మెంట్లలో 1201 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఇందులో సమస్యాత్మక ప్రాంతాలుగా 173 గుర్తించినట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈ కేంద్రాలలో 199 మంది సిబ్బందిని నియమించి గట్టి నిఘాతో నిరంతర పర్యవేక్షణ చేపడుతున్న ట్లు, అలాంటి కేం ద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సం ఘటనలు జరుగ కుండా పటిష్టమైన బందోబస్తును ఏ ర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేం ద్రాలలో నిఘా నే త్రాలు, ప్రతి వా హానానికి, సెక్టర్ అధికారులకు కూ డా జిపిఎస్ సిస్టం అనుసంధానం చే యడం



జరిగింది. జిల్లాలో ఎస్పీ, ఎఎస్పీలు, డీఎస్పీలు, సిఐలు, ఎస్సైల తో పాటు మొత్తం 3500 మంది పోలీసు బృందాల ఏర్పాటుతో పాటు పోలింగ్ కౌంటింగ్ కూడా జిల్లా అంతట పటిష్టమైన చర్యలను తీసుకోవ డం జరిగింది. హైదారాబాద్ నుండి ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది కి పోలింగ్ అనంతరం జిల్లా పరిధిలోని ఆర్టీసి ప్రయాణం ఉచితం పో టు, హైదారాబాద్‌కు వెళ్లే సిబ్బంది సాధారణ చార్జీలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. పెద్ద బస్సు లు 28, చిన్న బస్సులు 28, కార్లు 28, ఆటోలు 190, కాంటెనర్స్ 03 మొత్తం 277 వాహనాలను సిద్ధం చేసి, వివి ప్యాడ్స్, ఈవిఎంలను తరలించామని పేర్కొన్నారు. నాలు గు నియోజకవర్గాలలో పిఓ, ఎపి ఓ, ఓపిఓ 4804తో పాటు, రిజర్వ్ 903 మంది కలిపి 5772 మంది ఎన్నికల విధులను నిర్వహిస్తున్నారని తెలిపారు. 29 79 బియులు, 1508 సియులు, అలాగే వివి ప్యాడ్స్ 169 5 కేటాయించ డం జరిగింది. జిల్లాలో అర్హులైన 16739 మంది వికలాంగులకు, 728 ప్రాంతాలలో, 7 08 వీల్ చైర్లను అందుబాటు, అలాగే 721 మంది వాలంటీర్లను నియ మించి సేవలను అందించనున్నారు.

మోడల్‌గా తీర్చిదిద్దిన పోలింగ్ కేంద్రాలు

తిరుమలగిరి నవంబర్ 29, మనం న్యూస్: నేడు జరుగనున్న పోలింగ్‌లో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మోడల్ పోలింగ్ కేంద్రంగా బెలున్లతో అందంగా అలంకరించారు. మండల పరిధిలోని 40 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఈ కేంద్రాన్ని సుందరంగా అలంకరించడం పలువురిని ఆకర్షించింది.

నేడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- ఎన్నికల సామాగ్రి ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్త్ ఏర్పాట్లు

హుజూర్‌నగర్, నవంబర్ 29, మనం న్యూస్: నేడు జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన్నట్లు హుజూర్‌నగర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్డివో జగదీశ్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో బుధవారం ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని, ఈవీఎంలను పోలింగ్ కేంద్రాల వారిగా పంపిణీ చేసి పోలింగ్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌వో మాట్లాడుతూ... హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ సహకారంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ వ్యాప్తంగా 7మండలాలలో 2,47,592మంది ఓటర్లు ఉండగా 308పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వీటిలో 91సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్ట బందోబస్త్ ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకై 3 ఎస్ఎస్‌టీ, 3ఎఫ్ఎస్‌టీ, 9ఎంసీసీ టీంలు నిరంతరం పర్యవేక్షణ చేయనున్నాయి. 369పీఈవోలు, 369ఏపీవోలు, 738ఓపీవోలు పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల ద్వారా ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్త్
- ఎస్పీ రాహుల్ హెగ్డే

హుజూర్‌నగర్, నవంబర్ 29, మనం న్యూస్: రాష్ట్ర వ్యాప్తంగా నేడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్ర పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. బుధవారం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన వారి పట్ల మర్యాదగా ప్రవర్తించాలని పోలింగ్ బూత్‌లలోకి సెల్‌ఫోన్లు అనుమతించరాదన్నారు. 100మీటర్ల లోపు ఏలాంటి వారిని అనుమతించరాదని, భారీకేడ్స్ ఏర్పాట్లు చేసుకోవాలని, పోలింగ్ బూత్ అధికారి అనుమతి లేకుండా బూత్‌లోకి వెళ్ళవద్దని, పోలింగ్ కేంద్రాల వద్ద ఏవైన సమస్యలు వస్తే రూట్ అధికారులకు, స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. పోలింగ్ మొదలైనప్పడి నుండి పోలింగ్ కేంద్రాలను ఈవీఎం మిషన్లు తరలించే వరకు రూట్ మొబైల్స్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది, ఎలక్షన్ సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని, సమస్యలు సృష్టించే వారిని పికప్ చేసి అటువంటి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ, డిఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అష్టాదశ శక్తిపీఠ దేవాలయంలో మంత్రి పూజలు

కొండపాక, నవంబర్ 29, మనం న్యూస్: కొండపాక ఆనంద నిలయం ఆవరణలోని అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని మంత్రి హరీష్‌రావు బుధవారం సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రికి ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అష్టాదశ శక్తిపీఠ దేవతా మూర్తులను సందర్శించుకున్న అనంతరం మంత్రిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. మంత్రి వెంట పిఎసిఎస్ డైరెక్టర్ సురేందర్‌రావు, రైతుబంధు సమితి కో ఆర్డినేటర్ దుర్గయ్య, ట్రస్టు అధ్యక్షులు అయిత నాగరాజు ఉన్నారు. అదేవిధంగా దేవాలయాన్ని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

దీక్షా దివస్ చారిత్రాత్మకం

- తెలంగాణ ఏర్పాటుకు బాటలు వేసిన రోజు
- యావత్ తెలంగాణను ఏకం చేసింది
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు

సిద్దిపేట, నవంబర్ 29, మనం న్యూస్ ప్రతినిధిః తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అయితే నా శవ యాత్ర... లేదంటే తెలంగాణ జైత్ర యాత్ర అంటూ నిరాహార దీక్ష చేపట్టిన నవంబర్ 29 రాష్ట్ర ఏర్పాటుకు బాటలు వేసిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేటలోని రంగధాంపల్లి వేదికగా నిర్వహించనున్న నిరాహార దీక్షకు కరీంనగర్ నుండి బయల్దేరిన కేసీఆర్‌ను అల్గునూరు చౌరస్తా వద్ద అరెస్ట్ చేసి ఖమ్మం జైలుకు తరలించిన రోజు ఇప్పటికీ స్ఫూర్తిదాయకమే అన్నారు. దీక్షా దివస్ సందర్భంగా మంత్రి హరీష్‌రావు రంగధాంపలిలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి అమరులకు జోహార్‌లు అర్పించారు. అనంతరం సిద్దిపేటలోని ఆయన నివాసంలో రక్తదాన శిభిరంలో పాల్గొన్న వారిని అభినందించారు. ఎంతో పట్టుదలతో సమైక్యాంధ్ర పాలకులు అనుక్షణం అడ్డుపడుతున్నా మొక్కవోని ధైర్యంతో చేపట్టిన నిరాహార దీక్షే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గమైందని, యావత్ తెలంగాణను కదిలించిందన్నారు. 11 రోజుల నిరాహార దీక్షతో కేసీఆర్ చావు అంచుల్లోకి వెళ్లడంతో 33 పార్టీలు తెలంగాణకు మద్ధతివ్వగా తప్పని పరిస్థితుల్లో కేంద్ర మంత్రి చిదంబరం తెలంగాణ ప్రక్రియ ప్రారంభిస్తున్నామని చెప్పడంలో నిరాహార దీక్ష ఎనలేని పాత్ర పోషించిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం చేసిన పోరాటం ఫలించి తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నిధులు సమకూర్చుకోవడం, నీళ్లను సాధించుకోవడం జరిగిందన్నారు. నిరాహార దీక్షకు వేదికైన రంగధాంపల్లి నాడు వేలాది మంది పోలీసుల బూట్ల చప్పుళ్లతో భయాందోళనలకు గురి చేశారన్నారు. 2004లోనే నాటి కాంగ్రెస్ ఇచ్చిన మాట మేరకు తెలంగాణ ఇచ్చుంటే బలిదానాలు జరిగుండేవి కాదని, 2009లో తెలంగాణ ప్రక్రియను ప్రారంభిస్తున్నామని చెప్పి ప్రకటనలో జాప్యం చేయకున్నా ఇంతమంది అమరులయ్యేవారు కాదన్నారు. ఏది ఏమైనా దీక్షా దివస్ యావత్ తెలంగాణ ప్రజలకు స్ఫూర్తి దాయకమని అన్నారు

నేడే పోలింగ్

- ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు
- ఇన్సిడెంట్ ఫ్రీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా
- ఓటు హక్కు వినియోగించుకోనున్న సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావు దంపతులు

సిద్దిపేట, నవంబర్ 29, మనం న్యూస్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఇప్పటికే జిల్లా ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లను పూర్తి చేసింది. సమస్యాత్మక ప్రాంతాలలో పటిష్టమైన బందోబస్తు, డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి పరిస్థితులను పరిశీలించనున్నారు. 1151 పోలింగ్ కేంద్రాల పరిధిలో 9, 48, 664 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 1151

మంది ప్రిసైడింగ్ అధికారులు, 1151 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 2302 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు అదనంగా 817 మంది రిజర్వ్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంది. ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఆవరణలో ఎన్నికలకు సంబంధించి న సామాగ్రిని అధికారులకు అందజేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్, జియో ట్యాగింగ్ ద్వారా పోలింగ్ కేంద్రం సమాచారాన్ని ఎప్పటి కప్పుడు సిపి, ఉన్నతాధికారులు నేరుగా పరిశీలించేలా చర్యలు తీసుకున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎ న్నికలు జరిగేలా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, పోలీస్ కమీషనర్ శ్వేతలు ప్రతి రోజు పర్యవేక్షించారు.

ఓటు హక్కును వినియోగించుకోనున్న సీఎం

సీఎం కేసీఆర్ తన స్వగ్రామమైన చింతమడకలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సీఎం రానున్న నేపథ్యంలో హెలీప్యాడ్‌ను మంత్రి హరీష్‌రావు బుధవారం పరిశీలించారు. సీఎం కేసీఆర్ సతీసమేతంగా చింతమడకకు చేరుకోనున్నారు. అదేవిధంగా సిద్దిపేటలోని భారత్ నగర్‌లో ఆంబిటస్ స్కూల్‌లో మంత్రి హరీష్‌రావు దంపతులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఓటు ప్రాధాన్యతపై విస్తృతంగా అవగాహన కల్పించినట్లు, ఓటరు కార్డు స్లిప్పు లేకపోయినా ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డులలో ఏ కార్డునైనా తీసుకువెళ్లి ఓటు వేయవచ్చని సూచించారు. పుకార్లను నమ్మవద్దని, ఎవరైనా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తే సమీప పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే అవకాశం ఒక్క ఓటుకు మాత్రమే ఉందన్నారు. సమాచారం కేంద్రం నెంబర్ 1950 నిరంతరం పని చేస్తుందని, దీని ద్వారా పోలింగ్ కేంద్రం, బూత్‌నెంబర్ వివరాలను తెలుసుకోవచ్చన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు

జిల్లాలో పది డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సిపి శ్వేత తెలిపారు. ఎన్నిక లకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు, మొత్తం 2632 మంది అధికారులు పని చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసే రాజకీయ పార్టీల బ్యానర్లు, లోగోలు, ఎవరూ ధరించవద్దన్నారు. సిద్దిపేట జిల్లాకు చెందిన వ్యక్తులు తప్ప ఇతర జిల్లాలకు చెందిన వ్యక్తులు జిల్లాలో ఎన్నికలు పూర్తయ్యే వర కు ఎవరూ ఉండవద్దన్నారు. అధునాతన సాంకేతికతతో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 278, సాధారణ పోలింగ్ కేంద్రాలు 731 ఉన్నట్లు ఆమె తెలిపారు. సిద్దిపేట కమీషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని బార్డర్ పిఎస్ పరిధిలలో స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భారత ఎన్నికల సంఘం నూతనంగా ప్రవేశపెట్టిన సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులను అందజేయవచ్చన్నారు. ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాల సెంటర్ ఆవరణలో నిర్వహించాల్సిన విధులపై దిశా నిర్ధేశం చేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులు, వికలాంగులకు సేవలను అందించాలి

- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 29, (మనం న్యూస్): పోలింగ్ రోజున ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చే వికలాంగుల, వృద్ధులకు అవసరమైన సేవలను అందించాలని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి తెలిపారు.బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు పోలింగ్ రోజున కల్పించాల్సిన సేవలపై జిల్లా ఎన్నికల అధికారి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ, పోలింగ్ రోజున తమ ఓటుహాక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చె దివ్యాంగుల, వయోవృద్ధుల కొరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ఎన్ ఎస్ ఎస్ వాలంటరీనిలను సహాయకులుగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 743 వాలంటీర్లు అందులో 488 ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు 247 అంగన్ వాడి ఆయాలను 651 పోలింగ్ లోకేషన్ లలో వీరి సేవలను అందిస్తారని తెలిపారు. దివ్యాంగులకు, వయోవృద్ధు కొరకు ఉచితరవాణ సదుపాయాన్ని కల్పించడం జరిగిందని, వాహనాల ద్వారా పోలింగ్ కేంద్రాలకు చేరుకునే వికలాంగులు, వృద్ధులను ప్రత్యేక క్యూలో వీల్ చైర్ ద్వారా పోలింగ్ కేంద్రంలోకి తీసుకువెళ్లాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలను చూసుకోవాలని, బిఎల్ఓలు ఎన్ ఎస్ ఎస్ వాలంటరీలకు సహకరించాలని తెలిపారు. ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లకు టీ షర్ట్ అందించి. వాలంటీర్లుగా సేవలను అందించడానికి వచ్చిన వారిని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ సరస్వతి, అడిషనల్ డిఆర్డిఓ సంద్యారాణి, ఎగ్జిక్యూటివ్ అధికారి రాజేశ్వరి, సిడిపిఓలు అరవింద, ఉమరాణి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి పూజ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని ముంజంపల్లి గ్రామ సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డి మామ ఉమ్మెంతల నర్సింహారెడ్డి బుధవారం మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను మానకొండూర్ బిఆర్ఎస్ అభ్యర్థి డా.రసమయి బాలకిషన్ మరియు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సుడా ఛైర్మెన్ శ్రీ.జీ.వి.రామకృష్ణా రావులు పరామర్శించారు.

- మానకొండూర్, నవంబర్ 29 (మనం న్యూస్)

భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన సీపీ

ఖమ్మం, నవంబర్ 29, (మనం బ్యూరో): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో భారీగా పోలీసు భద్రత ఏర్పాట్లను చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ తెలిపారు. ఓటింగ్ కు అవసరమయ్యే సామాగ్రి పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు సెయింట్ జోసెఫ్ స్కూల్, ఖమ్మం రూరల్ మండలం శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రీసెర్చ్ కాలేజ్‌లో సిద్ధంగా వున్న జిల్లా పోలీస్ యంత్రాంగంతో పాటు మధ్య ప్రదేశ్ ,ఒరిస్సా రాష్ట్ర పోలీసులతో పాటు కేంద్ర సాయుధ బలగాలతో పోలీస్ కమిషనర్ మాట్లాడి...ఎన్నికలలో పోలీసుల విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. పౌరుల స్వేచ్ఛకు భంగం కలగకుండా ప్రలోభాలకు తావు లేకుండా ఓటరు పోలింగ్ కు కదిలేలా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి తగిన ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 390 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మొహరించినట్లు తెలిపారు. ఓటింగ్‌కు అవసరమయ్యే సామాగ్రి పోలింగ్ కేంద్రాలకు చేర్చే లా బందోబస్తు చేపట్టారని, పోలింగ్‌తో పాటు ఈవీఎంల భద్రత, ఓట్ల లెక్కింపు రోజున కట్టుదిట్టమైన భద్రత కల్పించేలా పోలీస్ కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు.పోలీస్ సిబ్బందికి అప్పగించిన భాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకు లోబడి పనిచేయాలన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్లు తమ ఓటు వేసిన తర్వాత పోలింగ్ బూత్, పోలింగ్ స్టేషన్ చుట్టూ తిరగకుండా చూసుకోవాలన్నారు. ఓటింగ్ చివరి గంటలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్ యొక్క 100 మీటర్ల వ్యాసార్థంలో గుమిగూడడం/వాహనాలు నిలపడం వంటి లేకుండా చూడలన్నారు. పోలీస్ స్టేషన్, ఎస్‌హెచ్‌ఓ, మొబైల్ పార్టీ ఇంచార్జీ , క్యూ ఆర్‌టి/ఎస్ఎస్‌టి మొదలైన ముఖ్యమైన ఫోన్ నంబర్లను సిబ్బందికి ఇచ్చిన డ్యూటీ పాస్పోర్ట్ పొందుపరిచినట్లు తెలిపారు. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు మీ పరిధిలోని మొబైల్ పార్టీకి లేదా పోలీస్ స్టేషన్కు సమాచారం తెలియజేయాలన్నారు. ఓటర్లను క్యూలైన్లో నిలబెట్టాలని, అగ్గిపెట్టెలు, యాసిడ్, సెల్ ఫోన్లు, ఇంక్ పెన్నులు, నీళ్ల సీసాలు, మారణాయుధాలు, తుపాకీలు మొదలైన నిషేధిత పదార్థాలతో ఎవరినీ పోలింగ్ స్టేషన్లోకి అనుమతించవద్దన్నారు. ప్రిసైడింగ్ అధికారి ప్రత్యేకంగా అభ్యర్థించకపోతే ఏ పోలీసు అధికారి పోలింగ్ బూత్లోకి ప్రవేశించకూడదన్నారు. 144 సెక్షన్ అమలులో వున్న నేపథ్యంలో గుంపులుగా వుండకుండా చూడాలన్నారు.

నేడు పోలింగ్

- ఖమ్మం జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకోనున్న 1216796 మంది ఓటర్లు
- పురుషులు 589165 మంది
- మహిళలు 627553 మంది
- ట్రాన్స్‌జెండర్లు 78 మంది

ఖమ్మం, నవంబర్ 29, (మనం బ్యూరో): సాధారణ ఎన్నికల్లో భాగంగా నేడు పోలింగ్ జరుగనుంది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 1216796 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 589165 మంది, మహిళలు 627552 మంది, ట్రాన్స్‌జెండర్లు 78 మంది ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 966439 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 471745 మంది, మహిళలు 494650 మంది, ట్రాన్స్‌జెండర్లు 44 మంది ఉన్నారు. 1098 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గాలవారీగా ఓటర్లను పరిశీలిస్తే...ఖమ్మం నియోజకవర్గంలో మొత్తం 322996 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 154978 మంది, మహిళలు 167969 మంది, ట్రాన్స్‌జెండర్లు 49 మంది ఉన్నారు. రఘునాధపాలెం మండలంలో 39822 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 19029 మంది, మహిళలు 20789, ట్రాన్స్‌జెండర్లు నలుగురు ఉన్నారు. ఖమ్మం అర్బన్‌లో మొత్తం 283174 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 135949 మంది, మహిళలు 147180 మంది, ట్రాన్స్‌జెండర్లు 45 ఉన్నారు. ప్రాలేరు నియోజకవర్గంలో మొత్తం 236287 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 114134 మంది, మహిళలు 122148 మంది, ట్రాన్స్‌జెండర్లు ఐదుగురు ఉన్నారు. వీరిలో తిరుమలాయపాలెం మండలంలో 49603 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 24159 మంది, మహిళలు 25444 మంది ఉన్నారు. ఖమ్మం రూరల్ మండలంలో మొత్తం 88511 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 42562 మంది, మహిళలు 45946 మంది, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. కూసుమంచి మండలంలో మొత్తం 49268 మంది ఓటర్లు ఉండగా పురుషులు 23924 మంది, మహిళలు 25343 మంది, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. నేలకొండపల్లిలో 48905 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 23489 మంది, మహిళలు 25415 మంది, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. మధిర నియోజకవర్గంలో 221326 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 107111 మంది, మహిళలు 114206 మంది, ట్రాన్స్‌జెండర్లు 9 మంది ఉన్నారు. ముదిగొండ మండలంలో మొత్తం 48157 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 23197 మంది, మహిళలు 24958 మంది, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. చింతకాని మండలంలో మొత్తం 41057 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 19690 మంది, మహిళలు21367 మంది ఉన్నారు. బోనకల్ మండలంలో మొత్తం 35835 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 17483 మంది, మహిళలు 18351 మంది, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. మధిర మండలంలో మొత్తం 56669 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 27330 మంది, మహిళలు 29334 మంది, ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఎర్రుపాలెం మండలంలో మొత్తం 39608 ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 19411 మంది, మహిళలు 20196 మంది, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. వైరా నియోజకవర్గంలో మొత్తం 193069 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 94057 మంది, మహిళలు 99005 మంది, ఏడుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. సింగరేణి మండలంలో మొత్తం 45011 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 22176 మంది, మహిళలు 22832 మంది, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. జూలూరుపాడులో మొత్తం 27632 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 13614 మంది, మహిళలు 14018 మంది ఉన్నారు. ఏన్కూరు మండలంలో మొత్తం 27498 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 13249 మంది, మహిళలు 14248 మంది, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. కొణిజర్లలో 48826 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 23798 మంది, మహిళలు 25027 మంది, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. వైరా మండలంలో 44102 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 21220 మంది, మహిళలు 22880 మంది, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో మొత్తం 243118 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 118885 మంది, మహిళలు 124225 మంది, 8 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. తల్లాడ మండలంలో మొత్తం 45747 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 22529 మంది, మహిళలు 23217 మంది, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. కల్లూరు మండలంలో మొత్తం 53475 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 26193 మంది, మహిళలు 27282 మంది ఉన్నారు. పెనుబల్లి మండలంలో మొత్తం 43174 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు21148 మంది, మహిళలు 22026 మంది ఉన్నారు. సత్తుపల్లి మండలంలో 64259 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 30971 మంది, మహిళలు 33281 మంది, ఏడుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. వేంసూరు మండలంలో మొత్తం 36463 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 18044 మంది, మహిళలు 18419 మంది ఉన్నారు.

ప్రజలారా నన్ను గెలిపించండి

- ఐదేళ్లు సేవ చేసుకునే అవకాశం కల్పించండి
- మీడియాతో కందాల ఉపేందర్ రెడ్డి

కూసుమంచి, నవంబర్ 29, (మనం న్యూస్): దోస్త్... తొందరపాటులో పొరపాటు చేద్దామా..!! ఆలోచించండి ప్రజలారా , ప్రజలారా నన్ను గెలిపించండి, ఐదు సంవత్సరాలు ప్రజా సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించండి అని మీడియాతో పాలేరు నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి కందాల ఉపేందర్ రెడ్డి అన్నారు, ఆలోచనతో అండగా ఉండమని ప్రజలను కోరారు, ఆలోచన చేసే సమయం ఇది దోస్త్ లారా ఆలోచించి అత్యధిక ఓట్లు మెజార్టీ ఇవ్వండి అని కోరారు, మీరు వేసే ప్రతి ఒక్క ఓటు ఈ ఐదు సంవత్సరాల భవిష్యత్తును నిర్ణయిస్తుంది..! రేపటి నుంచి గెలిచిన అభ్యర్థి మనకు అందుబాటులో ఉంటాడా లేడా..?అందుబాటులో ఉంటే మనలాంటి సాధారణ మనుషులకు కలుస్తాడా,? మాట్లాడుతాడా?, ఏదైనా ఇబ్బంది ఉంటే ఆదుకుంటాడా..? అని ప్రజల్లో ఉన్న అనేక ప్రశ్నలకు సమాధానంగా నేను మీకు దగ్గర ఉండి అండగా ఉండి నిలిచినాను, నేను గెలిచిన దగ్గర నుండి ప్రజాసేవ చేస్తున్న క్రమంలో ఏ ఒక్క తప్పు కూడా జరగకుండా జాగ్రత్తలు తీసుకొని ప్రజల్లో మమేకమై నడిచినాను, పరాయి పార్టీల వారి నమ్మశక్యంగా ని వాగ్దానాలను మాటలు నమ్మి మోసపోకండి, ఓటు వేస్తే రేపు నీకు సమస్య వచ్చినప్పుడు ఎవడు ఉంటాడు..? ఆలోచించండి ప్రజలారా, రేపు మీ ఇంట్లోనో పక్క ఇంట్లోనో తెలిసిన బంధువు బిడ్డలు పెద్ద చదువులకు ఇబ్బంది పడితే ఆదుకునే వారు ఉండాలిగా.! కొంచెం ఆలోచించు దోస్త్..!! పాలేరు నియోజకవర్గంలో ప్రజల కష్టాలకు అండగా నిలిచేది ఒక కందాల మాత్రమే, కందాల పేరు చెప్తేనే కష్టాలకు భయం ప్రజలకి ధైర్యం ,ఇది గత ఐదు సంవత్సరాల నుండి ప్రజల మధ్య ఉండి ప్రూవ్ చేసుకున్నాను ప్రజలారా, అభ్యర్థి ఇక్కడ నిరుద్యోగులకు నేను ఉన్న అండగా అనాలి.. ఎక్కడో హైదరాబాద్ బెంగుళూరు ఢిల్లీలో ఉండే అభ్యర్థులు మనకొద్దు..!!గత ఐదు సంవత్సరాల మాదిరి గానే స్థానికంగా ఇక్కడే ఉంది, నిత్యం పేద ప్రజలకు సాధారణ జనాలకు అందుబాటులో ఉండాలి.సమస్య ఏదైనా క్యాంప్ ఆఫీస్ కి వెళ్తే తీరుతుంది అనే భరోసా మనకు ఉండాలి. ఇలా ఉండాలి అంటే అది మీ పాలేరు ముద్దు బిడ్డ కేవలం కందాళ ఉపేందర్ రెడ్డి తోనే సాధ్యం.. పేద ప్రజలకు గాని, సాధారణ ప్రజలకు గాని న్యాయం జరుగుతుంది..ఆలోచించు మేరా దోస్త్.. ఒక్క ఓటుతో ఐదు సంవత్సరాలు నిశ్చింతగా ఉండొచ్చు..నేను చేసిన ప్రతి సేవను గుర్తుపెట్టుకోండి, నేను చెప్పిన ప్రతి మాటను గుర్తుపెట్టుకోండి ,నా మీద పెట్టుకున్న ఏ ఒక్క ఆశను వదులుకోకండి ,నన్ను గెలిపించండి ఐదు సంవత్సరాలు సేవ చేసి అదృష్టాన్ని కల్పించండి అని కందాల ఉపేందర్ రెడ్డి ఓటర్లను కోరారు.

మధిర కు వచ్చిన వైసీపీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను

మధిర, నవంబర్ 29, (మనం న్యూస్): మధిరలోని ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని మర్యాదపూర్వకంగా కలిసి తన శుభాకాంక్షలు తెలియజేశారు.

అన్ని దానాలలో కెల్లా అన్నదానం మిన్న

- బాణాల శంకరాచారి

మధిర, నవంబర్ 29, (మనం న్యూస్): మధిర మెయిన్ రోడ్ లోని వినాయక గుడి వద్ద అన్నదాన దాతలు దోసపాటి ప్రభాకర్ రావు వారి కుమారుడు విజయ్, పడిగల నాగార్జున, ప్రియాంక, వెంకటరమణ వారి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వినాయక ఆలయ కమిటీ చైర్మన్ బాణాల శంకరాచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా వినాయక ఆలయ కమిటీ చైర్మన్ బాణాల శంకరాచారి మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్ని దానాలలో కల్లా అన్నదానం మిన్న అని అన్నదాతలను అభినందించారు. ప్రతి ఒక్కరూ పుట్టినరోజు, పెళ్లిరోజు, గృహప్రవేశం సందర్భంగా వినాయకుని గుడి వద్ద అన్నదాన కార్యక్రమంనకు ఆర్థిక సహకారం అందించవలసినది గా కోరారు. ఈకార్యక్రమంలో దోసపాటి ప్రభాకర్ రావు, విజయ్, పడిగల నాగార్జున, ప్రియాంక, వెంకటరమణ, రవి శాస్త్రి, వలిశెట్టి శ్రీను, కోన జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అసెంబ్లీ ఎన్నికలు

- మధిర నియోజకవర్గం 2,21,326 మంది ఓటర్లు

మధిర, నవంబర్ 29, (మనం న్యూస్): నేడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ 119 స్థానాలకు ఎన్నికలు జరుగునున్నాయి. 119 స్థానాల్లో ఒకటైన మధిర నియోజకవర్గంలోని నియోజకవర్గ ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ సందర్భంలో ఎన్నికల కోసం మధిర నియోజకవర్గం పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామాగ్రి బుధవారం తరలించబడింది. మొత్తం నియోజకవర్గం లోని 221326 అంది ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుని వివిధ పార్టీల అభ్యర్థుల భవిష్యత్తును డిసెంబర్ 3 న తేల్చనున్నారు.పురుషులు 1,07,111,మహిళలు-1,14,206ట్రాన్స్ జెండర్స్-9, నియోజకవర్గం లోని మండలాల వారీగా ఓట్ల సంఖ్య ఏవిధంగా ఉంది.ముదిగొండ మండలంలో మొత్తం ఓటర్లు -48,157,చింతకాని మండలంలో మొత్తం ఓటర్లు -41,059,బోనకల్ మండలంలో మొత్తం ఓటర్లు -35,835, మధిర మండలంలో మొత్తం ఓటర్లు -56,669,ఎర్రుపాలెం మండలంలో మొత్తం ఓటర్లు -39,608 .ఈసారి -23,923 ఓట్లు పెరగగా యువత ఓట్లు -11.26% ఉన్నాయి.నియోజకవర్గంలోని మొత్తం పోలింగ్ కేంద్రాలు -268 ఉండగా వాటిలోనిసమస్యాత్మకా 85 పోలింగ్ కేంద్రాలు గుర్తించిన అధికారులు.2018 అసెంబ్లీ ఎన్నికల్లో 91.6 5% శాతంతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది మధిర. నేడు ఎంత శాతం పోలింగ్ అవుతుందో వేచి చూడాలి.

మల్లేపల్లి సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరిక

కూసుమంచి, నవంబర్ 29, (మనం న్యూస్) : కూసుమంచి మండలంలోని మల్లెపల్లి గ్రామంలో, తెల్లమేకల కనకయ్య ఆధ్వర్యంలో, మల్లేపల్లి గ్రామ సర్పంచ్ పొట్ట పింజర నగేష్, భార్య కుమారి మరియు పలువురుతో కలిసి కాంగ్రెస్‌లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో చేరినారు, కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పొంగులేటి శీనన్న, ఈ కార్యక్రమంలో గ్రామ మండల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

గుండాల ,నవంబర్ 29, (మనం న్యూస్): 30న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పినపాక నియోజకవర్గం గుండాల మండలంలో ఎన్నికలు సజావుగా ఎ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. మండలంలో 17 పోలి కేంద్రాలలో ఓటర్లు తమ ఓటును వినియోగించుకునేందుకు అణువుగా అధికారులు సర్వం సిద్ధం చేశారు. పినపాక నియోజకవర్గం గుండాల మండల వ్యాప్తంగా 12656 మంది ఓటర్లు ఓటు హక్కు ను కల్గి ఉన్నారు. అందులో పురుషులు 6274, స్త్రీలు 6382 మంది ఓటు హక్కును కలిగి ఉన్నారు. సమస్యాత్మక ప్రాంతం కావడంతో గుండాల మండల వ్యాప్తంగా ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గుండాల పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

న్యూడెమోక్రసీ కామ్రేడ్ అనసూర్యకు విప్లవ జోహారులు

- న్యూడేమోక్రసి డివిజన్ కార్యదర్శి ఉడగుల లింగన్న

దంతాలపల్లి, నవంబర్ 29, (మనం న్యూస్): మండలంలో పోట్లాడ క్రాస్ రోడ్ వద్ద బుధవారం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బొమ్మన బోయిన అనసూర్యకు తొర్రుర్ డివిజన్ కమిటీ సంతాప సభ నిర్వహించారు ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి ఉడగుల లింగన్న అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనసూర్య విప్లవ జోహార్లు తెలియజేస్తూ సంతాప సభ నిర్వహించారు. కామ్రేడ్ బొమ్మనబోయిన అనసూర్య మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యురాలుగా,ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలుగా విధులు నిర్వహిస్తున్న అనసూర్య గత కొద్దికాలం నుండి అనారోగ్యానికి గురై అనేక ఆసుపత్రిలో వైద్యం చేయించిన కోలుకోలేదు. బుధవారం హైదరాబాద్ లోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో చివరి శ్వాస విడిచారు. కామ్రేడ్ అనసూర్య పేద కుటుంబంలో జన్మించి 2003 సంవత్సరం నుండి సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీలో పూర్తి కాలం కార్యకర్తగా పనిచేస్తూ, న్యూ డెమోక్రసీలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ, ప్రజా సమస్యలను పరిష్కరించే ఉద్యమంలో చెప్పుకోదగిన పాత్రను పోషించారు. ఉద్యమాలే ఊపిరిగా, ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా, పాలకులకు వ్యతిరేకంగా, రాజీలేని పోరాటాన్ని నిర్వహించారు. అనేక ఉద్యమ పోరాటాలను నిర్వహించారు. మద్యపానా నిషేధానిపై మహిళలను ఐక్యం చేసి దండు కట్టి పోరాటం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమాలలో చురుకైన పాత్రను పోషించడం జరిగింది కలువల, ఇనుగుర్తి, దనసరి తదితర గ్రామాల్లోని పేదలను ఐక్యం చేసి పోడు భూములు నరికించారు. మహిళా సమస్యల పరిష్కారానికి, వారి హక్కులకై నినదించారు.సమాజంలో స్త్రీ పురుషుల సమానత్వంపై పోరాడారు. చావైనా బ్రతుకైనా గీత గీసి గెలిచి సవాలు చేసి న్యూ డెమోక్రసీ నిర్వహించిన పోరాటాలు రైతుకూలీ రాజ్యంపై రగుల జెండాలు ఎత్తిపోరాడారు. ఇలాంటి పోరాట యోధురాలు అనారోగ్యంతో అకాలంగా మరణించడం సిపిఐ ఎంఎల్ ప్రజలకు, మహిళా ఉద్యమాలకు తీరని నష్టం జరిగిందని తెలియజేస్తూ, కామ్రేడ్ అనసూర్య కు ఘనంగా అరుణా అరుణ జోహార్లు తెలియజేస్తూ సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఉడగుల లింగన్న, జిల్లా నాయకులు ఆలకుంట్ల సాయిలు, సబ్ డివిజన్ కార్యదర్శి చిర్రాయాకన్నా తోపాటు ధనమ్మ, మమత, పద్మ, లలిత, వెంకన్న, నాగరాజు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్డిఓ అశోక చక్రవర్తి

సత్తుపల్లి, నవంబర్ 29(మనం న్యూస్)ః సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు సత్తుపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్డిఓ అశోక చక్రవర్తి తెలిపారు, సత్తుపల్లి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,43,118. గాను, పురుషులు 1.18 885, మహిళలు 1.24 225, ఇతరులు, 8 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు, ఇందుకుగాను నియోజకవర్గ వ్యాప్తంగా ప్రాంతాలు 162,లో పోలింగ్ కేంద్రాలు 292, లో ఎన్నికల సూక్ష్మ పరిశీలకులుగా 56 మంది ని నియమించినట్లు ఎన్నికల పర్యవేక్షణ కోసం 20 మందితో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు 27 రూట్లో 120 వాహనాలతో పాటు పోలీస్ భద్రత కోసం 584 మంది తోపాటు ఎన్నికల నిర్వహణ అధికారులు 1868 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు, నియోజకవర్గ వ్యాప్తంగా 36 ప్రాంతాలలో 81 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు 5 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, నియోజకవర్గ వ్యాప్తంగా 100% వెబ్ కాస్టింగ్ జరుగుతుంది అని, కావున సత్తుపల్లి నియోజకవర్గ ఓటర్లు ఎటువంటి భయాందోళన లేకుండా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు, పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

కేన్ విలియమ్సన్ సెంచరీ.. అయినా కివీస్‌కు తప్పని కష్టాలు

బంగ్లాదేశ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్ రెండో రోజుకే రసవత్తరంగా మారింది. స్పిన్కు సహకరిస్తున్న సిల్హెట్ స్టేడియంలో రెండో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ను 310 పరుగులకే కట్టడి చేసిన కివీస్.. ఆ తర్వాత తాను కూడా స్పిన్ ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్.. 84 ఓవర్లు ముగిసేసరికి 8 వికెట్ల నష్టానికి 266 పరుగులు చేసింది. కివీస్ స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్.. 205 బంతుల్లో 11 బౌండరీల సాయంతో 104 పరుగులు చేశాడు.

ఓవర్ నైట్ స్కోరు 310-9 వద్దే రెండో రోజు ఆట మొదలుపెట్టిన బంగ్లా పరుగులేమీ జోడించకుండానే ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ కూడా తడబడింది. ఓపెనర్లు టామ్ లాథమ్ (21), డెవాన్ కాన్వే (12)లు విఫలమయ్యారు. 44 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన దశలో కేన్ విలియమ్సన్.. హెన్రీ నికోలస్ (19)తో కలిసి మూడో వికెట్కు 54 పరుగులు జోడించాడు. అయితే నికోలస్ను షోరిఫుల్ ఇస్లాం ఔట్ చేయడంతో కివీస్ మూడో వికెట్ కోల్పోయింది.

ఆ తర్వాత వచ్చిన డారెల్ మిచెల్ (54 బంతుల్లో 41, 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి కేన్ మామ.. నాలుగో వికెట్కు 66 పరుగులు జోడించాడు. ఇన్నింగ్స్ కుదురుకుంటున్న తరుణంలో తైజుల్ ఇస్లాం కివీస్ను మరోసారి దెబ్బకొట్టాడు. మిచెల్ను ఔట్ చేయడంతో కివీస్ కథ మళ్లీ మొదటికొచ్చింది. వికెట్ కీపర్ టామ్ బ్లండెల్ (6) కూడా విఫలమయ్యాడు. ఏడో స్థానంలో వచ్చిన గ్లెన్ ఫిలిప్స్.. 62 బంతులాడి 5 బౌండరీలు, ఒక సిక్సర్ సాయంతో 42 పరుగులు చేసినా అతడు కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. క్రమం తప్పకుండా వికెట్లు పడుతున్నా విలియమ్సన్ మాత్రం పట్టుదలగా బ్యాటింగ్ చేశాడు. మూడో సెషన్లో శతకం పూర్తి చేసిన అతడు.. శతకం ముగిసిన తర్వాత నాలుగు పరుగులే చేసి తైజుల్ ఇస్లాం బౌలింగ్లో క్లీన్ బౌల్ అయ్యాడు. ఆట ముగిసే సమయానికి కైల్ జెమీసన్ (7 నాటౌట్), టిమ్ సౌథీ (1 నాటౌట్)లు క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు ఇంకా 44 పరుగులు వెనుకబడే ఉంది.

కోహ్లీని సమం చేసిన కేన్ మామ..

టెస్టులలో కేన్ మామకు ఇది 29వ శతకం. తద్వారా అతడు భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో పాటు ఆసీస్ దిగ్గజం డాన్ బ్రాడ్మన్‌ల రికార్డు (29 శతకాలు)ను సమం చేశాడు. అంతర్జాతీయ క్రికెట్లో విలియమ్సన్కు ఇది 42వ సెంచరీ. ప్రస్తుతం ఇంటర్నేషనల్ క్రికెట్లో యాక్టివ్‌గా ఉన్న ప్లేయర్లలో 40కి పైగా సెంచరీలు చేసినవారిలో కేన్ మామ ఆరో స్థానంలో ఉన్నాడు. కోహ్లీ (80), డేవిడ్ వార్నర్ (48), జో రూట్ (46), రోహిత్ శర్మ (45), స్టీవ్ స్మిత్ (44)లు విలియమ్సన్ కంటే ముందున్నారు.

ఇండియన్ బెస్ట్ ర్యాంకర్‌కు షాకిచ్చిన 16 ఏండ్ల బాలిక.. ఆకర్షి ఔట్

భారత బ్యాడ్మింటన్ ప్లేయర్లలో ఉమెన్స్ సింగిల్స్‌లో ప్రస్తుతం నెంబర్ 2గా ఉన్న ఆకర్షి కశ్యప్‌కు భారీ షాక్. భారత్లోనే జరుగుతున్న సయిద్ మోడీ ఇంటర్నేషనల్ - 2023 టోర్నీలో పదహారేండ్ల బాలిక ఉన్నతి హుడా చేతిలో ఆకర్షికి పరాభవం తప్పలేదు. బుధవారం ముగిసిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఆకర్షి 21-15, 19-21, 18-21 తేడాతో భారత్కే చెందిన ఉన్నతి చేతిలో ఓడింది. ప్రపంచ స్థాయిలో 38వ ర్యాంక్లో కొనసాగుతున్న ఆకర్షి ఇటీవలే ముగిసిన చైనా మాస్టర్స్‌లో కూడా తొలి రౌండ్లోనే విఫలమైన విషయం తెలిసిందే. తొలి రౌండ్ గెలిచినా ఆకర్షి.. తర్వాత తడబడింది. మిగిలిన రెండు సెట్లలో ఆమెకు ఓటమి తప్పలేదు. హర్యానాలోని రోహ్తక్కు చెందిన ఉన్నతి.. గతేడాది ఒడిషా ఓపెన్ గెలుచుకుని అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ ఏడాది అబుదాబి మాస్టర్స్‌లో కూడా ఆమె సమియా ఇమాద్ను ఓడించి విజేతగా నిలిచింది. ఇక మరో భారత స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్కూ ఓటమి తప్పలేదు. గత కొంతకాలంగా పేలవ ఫామ్తో కొట్టుమిట్టాడుతున్న శ్రీకాంత్.. 21-23, 21-8 తేడాతో ప్రపంచ 36వ ర్యాంకర్ చియా హోలీ చేతిలో ఓడాడు. గడిచిన 18 బ్యాడ్మింటన్ వరల్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) టోర్న మెంట్లలో శ్రీకాంత్ తొలి రౌండ్లో ఓడిపోవడం ఇది పదోసారి కావడం గమనార్హం. 38 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో తొలి రౌండ్లో పోరాడిన శ్రీకాంత్.. రెండో రౌండ్లో మాత్రం పూర్తిగా చేతులెత్తేశాడు.

క్వార్టర్స్‌కు చేరిన శివ థప, అమిత్ పంఘల్

షిల్లాంగ్ (మేఘాలయా) వేదికగా జరుగుతున్న పురుషుల జాతీయ బాక్సింగ్ ఛాంపియన్షిప్ - 2023లో భారత బాక్సర్లు శివ థప, అమిత్ పంఘల్లు క్వార్టర్ ఫైనల్కు చేరుకున్నారు. 63.5 కిలోల విభాగంలో పోటీ పడుతున్న శివ.. 5-0 తేడాతో కర్నాటకకు చెందిన సంతోష్ హెచ్కె పై విజయం సాధించాడు. అసోంకు చెందిన శివ.. గతేడాది ఛాంపియన్షిప్లో స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. క్వార్టర్స్లో అతడు ఢిల్లీకి చెందిన బాక్సర్ శశాంక్ ప్రధాన్ను ఢీకొట్టనున్నాడు. ఇక 51 కిలోల విభాగంలో పోటీ పడుతున్న అమిత్ పంఘల్.. 4-1 తేడాతో పంజాబ్కు చెందిన జయ్‌దీప్ సింగ్‌పై గెలిచాడు. క్వార్టర్స్ పోరులో అతడు జమ్మూ కాశ్మీర్ బాక్సర్ మహ్మద్ అరిఫ్తో తలపడనున్నాడు. 2019లో వరల్ ఛాంపియన్షిప్‌లో రజతం గెలిచిన పంఘల్.. ఈసారి జాతీయ ఛాంపియన్షిప్ గెలుచుకునే దిశగా ముందుకు సాగుతున్నాడు. 92 కిలోల విభాగంలో 2021 ఆసియన్ ఛాంపియన్షిప్ విజేత సంజీత్.. 5-0 తేడాతో సావన్ గిల్ను ఓడించాడు. క్వార్టర్స్లో అతడు నమన్ తన్వర్ తో పోటీ పడనున్నాడు.

టాలీవుడ్ ముద్దుగుమ్మ బుట్టబొమ్మ పూజా హెగ్డే గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు.. ఫ్లాప్ సినిమాలతో పనిలేకుండా వరుస సినిమాలలో నటిస్తూ బిజీగా ఉంది.. నాజుకూ నడుము చూపిస్తూ కుర్రాళ్లకి నిద్ర లేకుండా చేస్తుంది. మరోవైపు స్టార్ హీరోలతో సినిమాలు చేసి మెప్పించింది.. ఈ మధ్య సోషల్ మీడియాలో హాట్ ఫొటోలతో సెగలు పుట్టిస్తుంది.. తాజాగా గ్రీన్ శారీలో వయ్యారాలను వలకబోసింది బుట్టబొమ్మ.. ఆ ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.. డిఫరెంట్ స్టయిల్ డ్రెస్సులు ధరించింది. ట్రెండీ వేర్లో అదిరిపోయే పోజులిచ్చింది. ఇందులో సూపర్ హాట్‌గా ఉండటం విశేషం.. ఈ అమ్మడు టాలీవుడ్‌లో టాప్ స్టార్స్‌తో కలిసి నటించింది. ప్రభాస్, మహేష్బాబు, ఎన్టీఆర్, బన్నీ, రామ్‌చరణ్ వంటి వారితోనూ కలిసి నటించింది. యంగ్ హీరోలతోనూ జోడీ కట్టింది. వరుస అవకాశాలే కాదు, వరుస విజయాలతోనూ లక్కీ హీరోయిన్‌గా మారింది కానీ గతేడాది ఈ బ్యూటీకి కలిసి రాలేదు. ఊహించని దెబ్బలు తగిలాయి. నటించిన నాలుగు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి.. బుట్టబొమ్మ పూజా హెగ్డే నాజూకు అందాలతో, క్యూట్ లుక్స్‌తో ఎలా మాయ చేస్తోందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కెరీర్ ఆరంభంలో ఒడిదుడుకులు ఎదుర్కొన్న పూజా హెగ్డే ఆ తర్వాత డీజే చిత్రంతో ఆమె జాతకమే మారిపోయింది. స్టార్ బ్యూటీగా మారింది.. ఒకవైపు వరుసగా ఫ్లాప్ సినిమాలు లిస్ట్‌లో పడుతున్న కూడా జోరు తగ్గలేదు.. వరుస సినిమా అవకాశాలను అందుకుంటుంది.. కొంత కాలం నుంచి పూజా హెగ్డే కి సౌత్‌లో కలసి రావడం లేదు. దీనితో పూజా హెగ్డే బాలీవుడ్ లో పాగా వేసేందుకు ప్రయత్నిస్తోంది. పూజా హెగ్డే చివరగా సల్మాన్ ఖాన్ కిసీకి భాయ్ కిసీకి జాన్ అనే చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే. తాజాగా పూజా హెగ్డే గ్రీన్ శారీలో అదరగొట్టేసింది. నిండుగా చీర కట్టిన పూజా హెగ్డే.. ఒంపు సొంపులు కనిపించేలా చిన్న స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించింది. దీనితో ఆమె క్లేవేజ్ సొగసు కుర్రాళ్ళని మైకంలో ముంచేలా దర్శనం ఇస్తోంది. అందాలు కనిపించేలా ఆమె హాట్ పొజిషన్ లో ఇస్తున్న సెల్ఫీ ఫోజు కూడా చాలా అందంగా ఇచ్చింది ఆ ఫొటోలే ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి..

మనం సినిమా
manamcinema

నితిన్‌కు సర్‌ప్రైజ్ గిఫ్ట్..

టాలీవుడ్ యాక్టర్ నితిన్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్. యాక్షన్ ఎంటర్టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రానికి వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్నాడు. క్యూటీ గాళ్ శ్రీలీల ఫీమేల్ లీడ్ రోల్లో నటిస్తోంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి లాంఛ్ చేసిన డేంజర్ పిల్లా, బ్రష్ వేసుకో పాటలు మ్యూజిక్ లవర్స్ను ఇంప్రెస్ చేస్తున్నాయి. డిసెంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్గా విడుదల కానున్న ఈ నేపథ్యంలో నితిన్ టీం ప్రమోషన్స్లో బిజీగా ఉంది. కాగా టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ తన సైన్ చేసి ఉన్న టీ షర్ట్ను నితిన్‌కు బహుమతిగా అందించాడు. అంతేకాదు ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ సినిమా విజయం సాధించాలని శుభాకాంక్షలు కూడా తెలియజేశాడు. సర్‌ప్రైజ్ గిఫ్ట్‌పై నితిన్ స్పందిస్తూ.. ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ నుంచి ఎక్స్ట్రా ఆర్డినరీ బహుమతి. ఈ కానుక అందించినందుకు ధన్యవాదాలు ధోనీ. లవ్ యూ.. అంటూ ట్వీట్ చేశాడు. టీషర్ట్ పట్టుకొని దిగిన స్టిల్ ఇప్పుడు నెట్టింట హల్ చల్ చేస్తోంది.

మల్లారెడ్డికి వయసైపోయి.. అలా మాట్లాడాడు

ఇంకో రెండు రోజుల్లో ఇండస్ట్రీ మొత్తం ఎదురుచూస్తున్న యానిమల్ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది రణబీర్ కపూర్, రష్మిక జంటగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం డిసెంబర్ 1 న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజ్‌ఐన ట్రైలర్, సాంగ్స్ సినిమాపై మరింత హైప్‌ను తీసుకొచ్చి పెట్టాయి. ఇక ఈ మధ్యనే యానిమల్ ప్రీ రిలీజ్ ఈవెంట్.. మల్లారెడ్డి యూనివర్సిటీలో గ్రాండ్‌గా జరిగిన విషయం తెల్సిందే. ఈ ఈవెంట్‌కు మహేష్ బాబు, రాజమౌళి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇక ఆ ఈవెంట్‌లో మంత్రి మల్లారెడ్డి మాట్లాడిన మాటలు ఎంతటి సెన్సేషన్ సృష్టించాయి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బాలీవుడ్ పని అయిపోయిందని, ముంబై పాతది అయిపోయిందని.. బాలీవుడ్ హీరోలందరూ హైదరాబాద్ వచ్చేయాలని.. బాలీవూడ్ హీరోల ముందే మాట్లాడాడు. ఇక వారు అప్పుడు ఆ వ్యాఖ్యలను స్పోర్టివ్ గా తీసుకున్నా.. బాలీవుడ్ మీడియా మాత్రం మల్లారెడ్డిని ఏకిపారేసింది. ఇక తాజాగా మాల్లారెడ్డి వ్యాఖ్యలపై సందీప్ రెడ్డి స్పందించాడు. ఒక ఇంటర్వ్యూలో సందీప్ మాట్లాడుతూ.. మల్లారెడ్డి గారు ఇప్పుడే కాదు ఎప్పుడు ఇలానే మాట్లాడతారు. అంతకుముందు ఆయన వేరే మీటింగ్స్ లో మాట్లాడిన మాటలను కూడా నేను విన్నాను. ఆయనకు వయసైపోయింది. అలాంటి వ్యక్తి ఏం మాట్లాడినా పెద్దగా పట్టించుకోనవసరం లేదు.. అంతేకాకుండా ఎంత ఇబ్బంది పడినా ఏం అనలేం కూడా అంటూ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. మరి ఈ సినిమాతో సందీప్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana and Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, **EDITOR: VUPPARI RAMESH KUMAR**. RNI Reg No.TELTEL/2016/72952. E-mail Id: editor@manamnews.com.